

మంజీరా రచయితల సంఘం
మెదక్ జిల్లా.

ACCHU

Collection of poems by

Dr. Siddenky Yadagiri
email: sygiri773@gmail.com
9441244773

Copy Rights : Author
First Editon : December, 2020.
Copies : 500

Rs. : 100/-
Library Copy Rs.: 200/-

Cover Desgin: Ahobilam Prabhakar

Books available at:

#19-44/2,Telecom Nagar,
Siddipet,Telangana, India.-502103.
8121144773. 9441679937


& All leading Book Shops
kinige.com
Telugubooks.in

Published
Manjeera Rachayithala Sangham, Medak Jilla.

Printed at:

Himalaya Graphics, Hyd.

గొంతులేనోల్ల గొంతుకై
కరోనా కాలంలో
కనపడకుండా పోయిన
కవులకు, కళాకారులకు,
మరియు
అందని దూరాలకు వెల్లిన
అతి సామాన్యులకు ....




ఒక రెక్క తీసిన

ఒక రెక్క తీసిన కిటికీ ముందు
కాఫీతో నేను
'సెప్టెంబర్ యాదగిరి తొవ్వ' నా ముందు
'నెల్లి సాబ్' కవిత్వ విషాదంలోంచి
ప్రపంచాన్ని చూస్తున్నా-
అంతా దిగులు దిగులుగా, గుబులు గుబులుగా
ఎవరో నన్ను తొక్కుకుంటూ వెళ్లారు
మరెవరో లేతవేళ్లతో జుట్టు చివరల్ని
మృదువుగా స్పృశించారు
ఒక రెక్క తీసిన కిటికీ ముందు నేను
ఎదురుగ్గా నల్లని గేటు
ఆపై లేతగా కదిలే చెట్లకొమ్మలు
చిమ్నీ పైన నుంచి వేళ్లాడే ఒక తీగ-
దూరాన హైదరాబాద్ ఇళ్లు
ఎండలో వేగిపోతూ- తనువంతా దగ్ధమౌతూ
ఒకదాంట్లో ఒకటి కలిసిపోతూ-

నే చూస్తుండగానే
చెట్టు నుంచి ఒక ఆకు రాలింది
ఒక పిట్ట అరుపును పొదివి పట్టుకుని
అలా చూస్తూ కూర్చున్న
        నా నుంచి ఒక సెగ-
యాదగిరి, నెల్లీసాబ్- నేనూ ఒకటౌతూ-

*సిద్దెంకి యాదగిరి- కవిత్వ పుస్తకం తొవ్వ
*నెల్లీసాబ్- ఇజ్రాయేల్ కవయిత్రి

15 మే 2013



అచ్చుమైన కవి

సిద్దిపేట కవులలో ప్రసిద్ధికెక్కిన వాళ్ళు ఇద్దరు ఉన్నారు. ఒకరు నవ్య సంప్రదాయ కవి శ్రీమాన్ వేముగంటి నరసింహాచార్యులు. వీరు నడుస్తున్న పద్యకవిగా తను జీవిస్తున్న కాలంలోనే ప్రఖ్యాతి గడించారు. మరో విఖ్యాత కవి నందిని సిద్ధారెడ్డి గారు. వీరువురితో నాకు వ్యక్తిగతంగా పరిచయం ఉంది. కవి సమ్మేళనాల్లో కలసి కవిత్వం చదివాను. ఇలా ఇద్దరు ప్రతిభావంతులైన కవులు పుట్టిన నేల మీద కలం పట్టిన వాడు మా సిద్దెంకి యాదగిరి. తెలంగాణ కవితాఝురి.

నిబద్ధ కవులు ఆర్తితో జీవిస్తారే తప్ప కీర్తి కోసం కక్కుర్తిపడరు. ఇది సుకవుల లక్షణం. అలాంటి నిజాయితీ ఉన్న నిబద్ధ కవి యాదగిరి. ఇది ప్రాచీన కవికైనా ఆధునిక కవికైనా అన్వయిస్తుంది. 'మా తొవ్వ', 'బతుకు పాఠం' ఈ రెండు కవితా సంపుటాల్లో యాదగిరి కవితాత్మ ప్రతిబింబిస్తూ ఉంటుంది.

నాకైతే అతడి అక్షరాల వెనుక అమాయకత్వమే కనిపిస్తుంది. విద్యావంతుడైన యాదగిరి కవితా ప్రస్థానం చిన్నది కాదు. అనుకుంటే ఆకాశమంత. కొల్చుకుంటే భూదేవంత. ఈ వాక్యము సిద్దెంకికే కాదు వేల సంవత్సరాల వేదనలోంచి, అంటరానితనంలోంచి అక్షరాల కవులు గాయకులు కళాకారులు అయిన ప్రతి దళిత జీవికీ మాటలు సరిపోతాయి. కులం లేదని చాలా మంది గొడవ పడతారు కానీ సురవరం వారు రూపొందించిన 'గోలకొండ' కవుల సంచిక అందులోని సంఖ్యలు సరిపోల్చి చూడండి. అసలు నిజం బయట పడుతుంది. ప్రతాప రెడ్డి గారి గణాంకాలు ఈ నాటికీ వర్తిస్తాయి. ఆ కోణంలోంచి చూసినప్పుడు తెలంగాణలో ముఖ్యంగా అతి దళిత మాదిగ కవులకు జరిగిన జరుగుతున్న అన్యాయం ఏమిటో తెలుస్తోంది. ఈ కవులు పోతన లాంటి ఆత్మగౌరవం ఉన్నవాళ్ళు. పురస్కారాల కోసం పాకులాడరు. ఒకరు గుర్తించినా గుర్తించకపోయినా నిర్భయంగా తమ కవిత్వం తాము సృష్టిస్తూ స్వయంభువులుగా ధ్రువతారలుగా నిలిచిపోతారు.

ఇదిగో సిద్దెంకి 'అచ్చు' అటువంటి కవి. ఇది చెప్పేందుకే ఇంత నేపథ్యం చెప్పాల్సివచ్చింది. సిద్దెంకి ఎటువంటి కవి? సిద్దెంకి ప్రశ్నించే కవి.

"ఒకటే దేశం ఒకటే భాష అంటున్నప్పుడు

ఒకటే కులం అని ఎందుకు అనవుతండ్రీ!" ఈ ప్రశ్నకు జవాబు చెప్తే కుల భారతమే ఉండదు. బాబాసాహెబ్ ఆశించిన కులనిర్మూలన సమాజమే

సమాధానం

కవిత్వం ఇప్పుడు రెండు రకాల భావాలతో వస్తున్న కాలం. ఒకటి మనువాదం. రెండు జనవాదం. లేదా బహుజన వాదం. ప్రసార మాధ్యమాలు పత్రికలు చూస్తున్న వాళ్ళకు ఈ విషయాలు స్పష్టమే. ఎవరు దొంగ నిద్రను నటించనవసరం లేదు. నిజమైన కవి భుజాలు తడుముకోడు. నిర్భయంగా జనంలోంచి మాట్లాడుతాడు.

దళిత కవిత్వంలో మాదిగ కవిత్వం ఆవిర్భవించినప్పటి నుంచి మాదిగ కళాతత్వం, సౌందర్యాత్మక దృష్టి ఎంతో వికసించింది. ఈ విద్యకు గుర్రం జాషువా గారిది గురుపీఠం. ఆ కుదరు నుంచే మాదిగ సౌందర్యాత్మకమైన భావుకత విరాజిల్లింది. గద్యంలోను వచన పద్యంలోనూ ఈ చిత్రణ గమనించవచ్చు. గద్యంలోనైతే బోయ జంగయ్య వేముల ఎల్లయ్య, జూపాక సుభద్ర, జాజుల గౌరి, రచనల్లో తేటగా కనబడుతుంది. నాగప్పగారి సుందర్రాజు, ఎజ్రాశాస్త్రి, ఇండ్ల చంద్రశేఖర్, చోరగుడి జాన్సన్ లాంటి వాళ్లను కూడా ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి. కవిత్వ విషయంలో సిద్దెంకి మొదటి నుంచి మాదిగ జీవన సౌందర్యకళను అక్షరబద్ధం చేస్తూనే ఉన్నాడు. ఈ సంపుటిలోని 'సుగంధాల లంద స్వప్నం' ఒక మచ్చుతునక. ఈ 'అచ్చు'వెనక అంటరాని అందమంతా తొణికిసలాడుతూ ఉంటుంది. సిద్దెంకిని కేవలం దళిత కోణంలోంచే చూడకూడదు. ఇతడు ప్రాపంచిక కవి. సంఘటనాత్మక అభివ్యక్తిలో అందెవేసిన చెయ్యి. భావుకవిత్వానికి పటం కట్టిన పట్టభద్రుడు.

సిద్దెంకి తెలంగాణ పజ్జొన్న కంకి. తీరొక్క పువ్వు లాగా ఉంటుంది ఇతడి కవిత్వం. ఎవరికి వాళ్లు ఆస్వాదించి, అనుభవించి, ఆ అనుభూతి పొందాలి గానీ విమర్శకుల మీదో, ముందుమాటల మీదో ఆధారపడకూడదు. మంచి కవితా సంపుటి అచ్చులోకి తెచ్చినందుకు అభినందిస్తున్నాను. ఇతడి 'అచ్చు' పని పదిమంది మెచ్చుకోవాలని ఆశిస్తున్నాను. కడపటి తరం లోంచి పుట్టిన మొదటి తరం కవి దోషాలను లోపాలను మీ లోపలి కోపాలను పక్కనపెట్టి కవి సిద్దెంకితో కరచాలనం చేయండి. పేరెన్నికగన్న కవిగా ఎదగాలని కోరుకుంటున్నాను. 'అచ్చు' కవితా సంపుటిని తెస్తున్నందుకు తమ్ముణ్ని తనివితీరా అభినందిస్తున్నాను.

– ఎండ్లూరి సుధాకర్
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
8500192771.

దీపాల రాత్రి,
14-11-2020.

నా మాట

తెలుగు సాహితీ మిత్రులకు నమస్కారం. మరో కవితా సంపుటి 'అచ్చు'తో నేను మీ ముందుకు వస్తున్నాను. అచ్చు అనగా చెప్పు కొలత, పోలిక, స్వరం అను అర్థాలున్నాయి. నా మొదటి పుస్తకం 'మా తొవ్వ' కవితా సంపుటి తెచ్చి పుష్కరకాలం గడిచింది. రెండోది 'బతుకు పాఠం.' సాహిత్య ప్రవాహ పరంపరలో కొనసాగుతున్న నాకు ప్రోత్సహం అందజేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు.

తన కవితలో నన్ను ఆవిష్కరించిన ప్రముఖ కవి కె. శివారెడ్డి గారికి, ముందు మాట రాసిన ఎండ్లూరి సుధాకర్ గారికి, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, కొలకలూరి ఇనాక్, గుండె డప్పు కనకయ్య, దార్ల వేంకటేశ్వర రావు, కాసీం, డి. బాలయ్య, దరువు ఎల్లన్న, జూపాక సుభద్ర, గోగు శ్యామల, జి. విజయలక్ష్మి గారలకు,

మరియు ఉస్మానియా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్‌లకు

ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, ఎంపీపి మాణిక్యరెడ్డి, టి. ఎల్లయ్య ...గారలకు,

కంశ్రీ, పప్పుల రాజిరెడ్డి, కె.రంగాచారి, కె. అంజయ్య, ఎన్. భగావాన్ రెడ్డి, తోట అశోక్, తైదల అంజయ్య, పొన్నాల బాలయ్య, వే. మురళీ, చిల్ముల శ్రీనివాస్, గంభీర్రావ్‌పేట యాదగిరి, తెరసం శంకర ద్వయాలకు, తప్పెట ఓదయ్య, చిత్తలూరి ఎస్సెన్, గజ్జెల కనకరాజు, సిద్దెంకి రాములు గారలకు, వేములఘట్ స్టాఫ్‌కి

ఈ కవితా పుస్తకంలోని కవితల్ని ఎంపిక చేసి ప్రచురించిన పత్రికలకు, సంకలనకర్తలకు, న్యాయ నిర్ణేతలకు,

గ్రామము గోనెపల్లికి, చిన్ననాటి మిత్రులందరికీ, విమర్శించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

నన్ను కనిపెంచిన తల్లి దండ్రి సిద్దెంకి లచ్చవ్వ, రాజయ్యలకు ప్రణామములు.

నా సహచరి పుణ్యకు, కూతురు హర్షవర్ధినికి ఆశిస్సులు.

మంజీరా రచయతల సంఘం, తెలంగాణ రచయితల సంఘం, తెలంగాణ వికాస సమితి, దరువు కళా బృందం, జంబూ సాహితీకి(నిర్వాహకులకు), వివిధ సాహితీ సంస్థలకు, న్యూస్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు కృతజ్ఞతలు.

ఈ 'అచ్చు' కవితా సంపుటిని ఆశీర్వదిస్తారనీ.... జై భీంలతో..

మీ

సిద్దెంకి

సాలుపోత

నాయిన తొవ్వ

మనకు అచ్చిరాదే అంటే సచ్చినా ఇనడు
నచ్చిన పని ఎంత ఖచ్చితంగా జేస్తడో
నచ్చకపోతే కూడా అంతే
పుట్టమీది పూజైనా తప్పొచ్చు
రెప్పమూయని సైనికునిలా ఎవుసమంటే ఎర్రి
నాయిన పానం పెయిల ఉండది
ఎవుసంల వుంటది
ఎందుకను?
రేషం అగ్గిమీద గుగ్గిలమైతది
మొలకెత్తే యిత్తునంలా
మనసు పొరల్లోంచి జవాబిస్తడు
గతం నెమరేస్తడు
ఓపికుండాలెగని బతుకు పసరు పిండి
మనసు తీపి జేస్తడు
ఒక్కొక్క అనుమం ఒక్కో దిక్సూచి

బుడ్డెడొడ్లకు బల్జోల్లకు
బర్లకాడ జీతమున్న బాపతిగాన్ని
మాయితనం జీతం బతుకు
బాకీల బాధకు రెక్కలరుగ కష్టంజేసిన
మందికి జేసినోన్ని మనకు జేస్తేంది?

పేగులు నకనకలాడంగా శమట కలిపి మన్ను పిసికిన
పంట పండాలనీ కంటినీ ఒంటినీ దీపం జేసిన

ఎడ్లతోటి పోటీపడే ఎద్దునైతి
పనిల మొనగాడని పేరుదెచ్చుకుంటి

బతుకు అరమంద్రం కావొద్దని నిన్ను బడికి మేం పనికి
గుణం గుర్తెరిగి గుడిసెల నుంచి ఇంట్లకు పోతిమి
కిందపడి మీదపడి ఎకురంనర బూమి కొంటి
నువ్వు నౌకరిగానివైనా మట్టిసోపతి మనాది పోకపాయే
శాతనై కాల్రెక్కలాడంగా కువ్వారంగా కూసుండుమంటే ఎట్లా ?

కరువు కాలం సూసిన
లేకిచేసి, లేక బతికినం
కడుపు నిండినా, ఎండినా
కడుపు చూసే కన్నతల్లి ఈ భూమే
మట్టి పేగుబందం,బతుకు సంవందం
నా మాయిముంత, నా ముని మనుమల దాకా
ఇదే తావుల ఇదే రేవుల
దరిలేని బాయిల దుంకినట్లు
ఊపిరి వోసిన ఊరునిడిసి ఎక్కడికో రమ్మంటే ఎట్ల?
ఎల్సిపోని మనసులు ఎరిగిన మనుషులు
మర్మమెరిగిన జాగల మన్నుబుక్కాలే

మారని ఊరు చేసే ఎవుసం దేన్నిడువ
కొడుకా! నీ దయరా! ఎక్కడికి రాను
దిక్కులేని దగ్గర ఏ దిక్కు సూడాలె?
మనసు ఇప్పి మాట్లాడెటోల్లుండరు
మాట ఉండది ముచ్చట ఉండది

నీళ్లలేని తావుల చేప బతుకుతీరు
నాలుగ్గోడల నడుమ నన్నో చెక్క బొమ్మను జెయ్యకు

తీరినపుడు నువ్వే రా... పో...
ఆదివారం అర్సుకో

చుట్టి ఉన్ననాడు సూసిపో
పురాగ శాతకానపుడు అవరైన వస్త! ఆఖరైన వస్త!!
అప్పట్దాక ఎవుసం వద్దనకు బిడ్డా!

దండిగా మెండుగా ఉన్నంతల మొండిగా బతుకు
గోసపడ్డా సరే! ఆసపడక బతుకుమనే
ఎండల నీడకు పిల్సినట్లు
దూపకు సల్లని నీళ్లతీరు మేలు జెయ్యిమనే
నాయిన ఒక బతుకుతొవ్వ
అనుభవసారం, ఆత్మగౌరవం
చెప్పొద్దుగాని నాయిన పిసక మనిషే
ఆత్మ విశ్వాసం ఒక దేశానికున్నంత ఉంది
నాయినే నా పతాక
నాయిన వారసత్వం పంచుక పుట్టినోన్ని
నాయిన చేతులల్ల పెరిగినోన్ని
నాయిన కెట్ల ఎదురు చెప్త?
నేనెపుడూ నాయిన ఆశల వారధిని
ఆశయాల సారథిని

24.9.2015 11గం. రాత్రి

తేది 21.03.2016న నవతెలంగాణ దినపత్రిక నిర్వహించిన శ్రీ వట్టికోట ఆళ్వారు స్వామి కవితల పోటిలలో తృతీయ బహుమతి. నవతెలంగాణ సోపతిలో ప్రచురితం. నాన్న పదం పుస్తకంలో ప్రచురితం.

సుగంధాల లంద స్వప్నం

ఆ పొద్దు పొడుపులో
ఏమ్మహిముందో ఏమోకానీ
వయసులో అరవై దాటిన అయ్య
పొడుస్తున్న పొద్దును భుజానేసుకొని
భూలోకాన్ని జయించినట్లు
చిర్రా చిటికెన దరువులు
తన అడుగుల జంగలతో మొగులుని తాకినట్లు
ముల్లోకాలు మురిసెటట్లు ఎగిరిదుంకుతడు

ఎసులల ఏమేస్తదో ఏమోకానీ
రుచికోసం నాలుక తాపిలుకొంటది
అవ్వచేసే వంట గుమగుమలు
వాడకట్టంత గుప్పుమంటయి
అట్టితున్కలు నమిలినా,
బొక్క కంకినా
పూలుగు జుర్రుతుంటే
సర్గం దిగొస్తది
పసివట్టిన నాలుకలు
నోరిడిసి అడ్గలేక పంచకు చేరుతయి

పట్టుకుంటే దొరుకని ఎల్సిన బతుకు అక్షరాలల్ల
ఏముండదనిపిస్తది కానీ
మనసువెడితే
పట్టజాలనంత బతుకుంటది
మనసువడితే ఒడువని దినుసుంటది

ఎల్సిన బతుకుల్లో
పచ్చి పచ్చి గాయాల గుర్తులు
గంజిలేకున్నా జీవిగంజిపోసే తండ్లాటలు
మండే ఆకలిని
ఓర్చుకునే గుణం ఒలిశెంత
శెటాకు మాంసంలేని శెత్తల టన్నుల ధైర్నం
జీవునాల్ని లెక్కచెయ్యనితనపు తెగారం
పదాల్లో బాధల పదన
తిరుగుబాటుకు అద్దిన పదును
నూరిపోసే తరుగని రేషం
వాక్యగాలానికి చిక్కిన ఎతలు
అల్లికల వలల పడిన మనుగడ తొక్కులాటలు
ఒక్కటేమిటి?
ఎన్నో ఉంటయి వినే మనసుంటే

లంద సుగంధాల ముడుపుకట్టి
కష్టసుఖాలను కలగలపిన బతుకుల్ని
కదిలే కాలంతో కలెపడాలని
రేపటిపొద్దుకు హద్దుల్లేని స్వేచ్ఛని
కవిత్వంగా అద్దాలనేది నా స్వప్నం

11-09-2017. రాత్రి 7 గం. లకు

అక్షరాలు

నియంతృత్వ నిర్మూలనకు ఆలోచన నిప్పులయి
మేల్కొల్పే అక్షరాలు రగరగ మండుతయి
కన్నీరై కలతచెందే కల్లోలముల విధ్వంసం విత్తి
యుద్ధానికి సదా సిద్ధం చేస్తయి
రసికారే గాయాలపై మాయని మచ్చలపై
మలాం పూయడానికి అక్షరాలు ఔషధమైతయి
కారే కనుకొలుకుల్ని కొంగవాలు కత్తుల్ని చేస్తూనే
మనసును విల్లును జేస్తయి
తెగిపడ్డ అంగాలకు నల్లాలంపూసి
మొండితనపు మొగిల వాడిపోని చిగురు మొలిపిస్తయి
ఉగ్గు తినిపించినంత సుతారంగా
భరోసాతో కొయ్యల్నిచేసి
అన్యాయాన్ని గావుపట్టేలా పురికొలుపుతయి
హక్కుల్ని కట్టడిచేసే ఇనుపతనానికి
సునామి ఉప్పెన తేస్తది

తిరిగే పొద్దుని బంధించినా కొద్దీ
భవిష్యత్తు సంధించే అక్షరాలు
మనసుల్ని కదిలిస్తూ బెదురని ఎదల్లో చెదురని సంతకమైతయి
కుతంత్రమే రణతంత్రమయ్యే చోట
అక్షరాలు మనసు ధరిత్రిలోంచి అగ్గిపిడుగులై
ఆశలేని ప్రాణాల్తో మొలుస్తుంటయి
చేవతగ్గని అక్షరాలు చరిత్ర శాసనం
కాలం కంఠహారంలో త్యాగాల తోరణమై
స్ఫూర్తినింపే ఆదర్శ భూషణం

14-09-2017రాత్రి 9 గం. లకు

నేటినిజం 21-06-2017. సాహితీ కెరటాలులో ప్రచురితం.

రక్తాక్షర పతాకం

ఇజంగా ప్రకటించే అక్షరపతాకం
నెత్తురు చిందిన కలాన్నిచూసి
కాలం జండాకర్రపై అవనతనమై గుండెల్ని బాదుకుంటుంది

భావప్రకటనా స్వేచ్ఛ పత్రికా శీర్షికలై మేల్కొల్పొతుంటే
భరించని పిరికి మతమౌఢ్యం కలం గుండెల్ని కాల్చుతున్న బందూకు
నెత్తురు కూడు తినమరిగిన రాజకీయం
చట్టమని వల్లిస్తున్న ఆదర్శరాజ్యంలో పత్తా దొరుకని హత్యలు
సాక్ష్యాలయి తిరిగే అక్షరాలపై కక్ష
చైతన్యం నింపే అక్షరాలకు శిక్ష

మత్తును చురకత్తులు చేసే పత్రికా సంపాదకులపై
సంపుదు పంజెం వేట
విముక్తిగీతాల్ని వినిపించే కవుల గళాలపై కత్తికోత
రాతలను నుదుటిరాతలుచేసే రచయితలపై మృత్యు మృదంగం
వెంటాదుతున్న నెట్వర్క్

ఆశల్ని చంపిన పైశాచికత్వ వికటట్టహాసానికి
విరుగుడై విచ్చుకుంటున్న ఆశయాలు
వైఫైలయి చైతన్యప్పొరల్లో ప్రశ్నిస్తున్న ఆలోచనలు

సావులన్ని అచ్చేదిన్‌లకు రేవులయితే దుర్మార్గపు విచ్ఛేధన్‌లే ఉంటయి
రక్తంలో తడుసుఅక్షరాలు నేలను చీల్చుకొని మొలకెత్తే పంటలా
మనసుల్లో మార్పు మొలకెత్తుతే.....?

12/09/2017. ఉ. 5.గం.లకు గౌరి లంకేష్ హత్యకు నిరసనగా...

బుద్ధం శరణం

చావు గీతాల ఆర్తనాదం విన్న మనో వేదన
దు:ఖ రహిత జగతికై మరణ కంపన
మనుషుల్ని ప్రేమించే యువరాజు భోగలాలసాల్ని వదిలి
వెతుకులాట లాంతరైన సర్వసంగ పరిత్యాగం
ధ్యాన కాంక్ష మనోనేత్రం జ్ఞానోదయం
వికసించిన బుద్ధి అధిగమించాల్సినవి కోరికలు

కలవరపరచే గాయాలకు కట్టుకట్టే బోధ
అష్టాంగమార్గం దిద్దిన ఆత్మవిశ్వాసం
అమానవీయ ఎడారిలో వసంతం పూయించిన మానవత్వం
మనసులు హత్తుకునేలా విత్తిన సిద్ధార్థుడి ఉపదేశం
మడికట్టుకునే పిడివాదానికి మనిషితడి పరావర్తనం
కులాంతరాల్ని కూల్చి నింపిన కూరిమి

వ్యభిచారులనీ, వ్యసనపరులనీ దొంగలనీ,
మహా మహా చక్రవర్తులను మనుషులుగా తీర్చిన ధర్మదీక్షలు
ఖండాంతరాలు దాటి అంతరంగాల్లోకి ఒంపిన సత్య ప్రమాణం

జనంలో మనమై పరిభ్రమిస్తూ
ధర్మచక్ర పరావర్తనం పరివర్తనం
విశ్వాన్ని జయించే జగజ్యోతి
సదా! బుద్ధం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
దమ్మం శరణం గచ్ఛామి

23-09-2017,రాత్రి 10:40 ని. లకు

వేములఘట్టు

పందిరి మీది గుండు ఉరుములేని పిడుగై
మిన్నోలే యిరిగి మీద పడ్డది
కరెన్సీ కలలుకనే రాజ్యం
పచ్చని బతుకుల్ని విచ్ఛిన్నంచేసి
వెండితెరమీది ఆకుపచ్చని వసంతాన్ని
మొండిగా పూయిస్తుంది

ప్రాజెక్ట్‌కి, అభివృద్ధికి వ్యతిరేకం కాదనీ
పరిహారం పెంచాలనే మొర
వసతుల కోసం వాదన

దిక్కులు పిక్కటిల్లేలా
ఒక్కతీరుగ వలపోస్తున్న
దిక్కులేని జనం
ఎక్కు పెట్టిన బాణం

ధర్నాలు
భూమి పలిగిన ఊసిళ్ల పుట్ట
రాస్తారోకోలు
చౌరస్తాల్ని బంధించిన కబంధహస్తాలు
నిరసనలు
నింగిని తాకే ప్రతిధ్వనులు

గాయపడ్డ ప్రజల గొంతు
రెక్కలు తెగిన పక్షులోలే
కాకిగోల ముందు మూగనోము నోస్తుంది

ఇక్కడి నేల
కదనానికి కత్తులు దూస్తయి
ఇక్కడి పంటలు
బతికెతందుకు జీవిగంజి పోస్తయి
ఇక్కడి గాలి
అమరుల త్యాగాల్ని అత్తరులా వీస్తయి
ఇక్కడి చెల్క
రాజ్యంతో మొట్టమొదలు తలపడిన
గిరాయిపల్లి ఎన్‌కౌంటర్

తప్పుల్ని నిప్పుల్ల కడిగే కొంరెల్లి మల్లన్నా!
భరోస కల్పించేదాకా సాగర్ వద్దనీ
ఊరుని పెద్దపట్నం చేసి
బొడ్డాదని పిల్లకాన్నుంచి అగ్గి గుండాలు తొక్కుతున్నం
అల్లా! యేసూ!!
దొల్ల శాసనాన్ని తొక్కుతమని మొక్కుతున్నం

ఈ ఘట్టుగురించి
పొద్దంత చెప్పినా ఒడువది
వేములఘట్టు పట్టు
ఉడుంపట్టు
పట్టు పట్టనే పట్టది
పడితే
పానం పోయినా ఇడువది

31.03.2017 ఉ.4.30గం.లకు

ఆరిపోని జ్యోతి

వెలివాడ లంద వెదజల్లిన జాతి పరిమళం
రేపటి కిరణాల్ని దోసిట్లో పట్టుకొని
అంటరాని ధూళిలో కన్నీరు వదిలించడానికి
సావిత్రిభాయి తొవ్వల చేసిన
నడక సంతకం ఆమెది

అవమానాల్ని చిమ్మడానికి
అక్షర కొమ్ములకు బలుపాలు కట్టి
పసికలల పనలకు ఆత్మగౌరవం దిద్దిన
వెలుగు ముద్దెర ఆమెది

ఊపిరి ఉన్నంత వరకు
బతుకును ఓ ఒత్తిని చేసి
పసిపిల్లల పొద్దుపొడుపు జ్ఞానాన్ని
మరిగించిన దీపశిఖ ఆమె

నిన్ను కాపాడుకోలేని వ్యవస్థలో
బతుకుతున్నందుకు కన్నీళ్లయి
కలం దించి, శిరసొంచి
వీడ్కోలు పలికినా
చల్లబడిన నీ బీజాక్షరాల్లో
నిరంతరం వెలుతురు ధృవతారవు

సీపిఎస్ ఉపాధ్యాయిని (25-09-2017) జ్యోతి అకాల మరణానికి స్పందించి.. అక్షరం, సూర్య దినపత్రిక 3-09-2017న ప్రచురితం.

గొంతు విప్పడం నేర్చుకో...

మాయల పేరడి,
మాటల గారడి
రెండునాల్కల ధోరణిపై
పురివిప్పిన గొంతయి రగుల్కో
అంతం తేలిపోతది

ఆరోపణల అగ్గికురుస్తూ
పరువును మింగపోతున్నపుడు
ఆధారాలతో ధారాపాతంగా
గొంతుక సెలయేరవ్వడం నేర్చుకో
నిరూపణల్లేనివన్నీ కొట్టుకపోతయ్

నిత్యం అనివార్య యుద్ధం
ఓడిస్తూ, పీడిస్తూ
పీల్చి పిప్పి చేస్తున్నపుడు
గొంతు గాండీవం ఎక్కుపెట్టడం నేర్చుకో
గెలుపు రెపరెపలాడుతది

అస్థిరత సునామి మింగబోతున్నపుడు
ఆకాశం అందుకునే కెరటంలా
గొంతు శబ్దం ఎగజిమ్మడం నేర్చుకో
సుస్థిరత నీ ఆస్థి అవుతుంది

అవమానం అణువణువున కృంగదీస్తుంటే
మనసు పేల్చడానికి
మనిషిని కూల్చడానికి సిద్ధపడుతున్నపుడు
గొంతును మరుగుతున్న ఆయుధం చేయడం నేర్చుకో
నిందలు బహుమానమైతయి

అక్రమం విస్తరించే చోట
విలువలు కుచించుకు పోతున్న చోట
ఆలోచన గాల్లో గింగిర్లయి ప్రతిధ్వనించటానికి
గొంతును శబ్ధభేరి చేయడం నేర్చుకో
విలువలు గొడుగులై విచ్చుకొంటాయి

నిందల పొగరు మొలలు
అవమానాల దండె
భరించకుండా బాధిస్తుంటే
జనప్రభంజనాల్ని పెకలించడం నేర్చుకో
సంతోషం దిక్దిగంతాలకు వ్యాపిస్తది

పాశవికత అస్తిత్వాల్ని కొల్లగొడుతున్నపుడు
అనాగరికత అందలమెక్కుతూ
ఏలికల లుకలుకల్ని చించిపారేయడం కోసం
అనంతంగా గొంతెత్తడం నేర్చుకో
మూర్ఖత్వం సర్వనాశనం

ఇజాల కోసం గాదు
నిజాల కోసం, సమాజం కోసం
గొంతు విప్పడం నేర్చుకుంటే
వ్యక్తిత్వం శక్తివంతం
వ్యవస్థ సమర్థవంతం

శవప్రశ్న

మనిషికీ మనసుకీ
అల్లుకుపోయే మేనుబంధం
మెడకోసినా కొద్దీ అతుక్కుంటది

కులకంపరం రంపమై
మధుకర ప్రేమను
వివక్ష
జరాసంధున్ని చేసి రెండుగా చీల్చింది

చరిత్ర మొఖంపైన
కమిలిన దెబ్బల్ని
అంతరాల కులమౌఢ్య కుడ్యాలను కూల్చేదాకా
బర్రల్ని పొగరుమొలల్ని చేసి
బాధించాలనుకునే మనసుల్ని బ్లాస్టింగ్ చేస్తే..?

పురివిప్పిన పంచముని ప్రేమపింఛాన్ని
ఉరివెట్టి జీవిదీసిన ఉన్మాదంతో
పీకబడిన కళ్ళకు చూపునిచ్చి
లక్ష నక్షత్ర కాంతులతో
శిక్షగా నింగిలో నిలిపితే ...?

అంటరానితనాన్ని చెరిపేసిన ఒంటి బంధం
తెగిపడ్డ మర్మాన్ని ఛేదించే క్షిపణిని చేసి
తెగువను అద్ది మొగులు మీద లక్ష్యం కోసం ప్రయోగిస్తే...?

బంధించబడుతున్న వాస్తవం
పోస్టుమార్టమ్ వాసన గుప్పుమంటూ
దేశపు దేహమ్మీద వ్యాపిస్తున్న దుర్గంధం
చచ్చిన శవం పెచ్చులూడుతూ
విరిగిపోతున్న విలువలకోసం
కోయబడ్డ శిశ్నంలోంచి ఉదయిస్తున్న ప్రశ్నలు

కులాలు వద్దలంటూనే కులహత్యలా?
వివక్ష లేదంటూనే మరణశిక్షలా?
అంతా ఒక్కంటంటూ అంతం చేయడమే పంతమా?

వెలివాడ తేనెటీగల్ని
ఎన్నిసార్లు తెగ్గోసినా
కవ్వించే పుప్పొడి
కుతికెల్ని నరికినా
మృత్యువును ముద్దాడుతూ
ప్రేమ నవ్వుతూ
మధువునూ సేకరిస్తుంది

15-04-2017, 2 గం. లకు
నవతెలంగాణ 'దర్వాజ'లో 24-04-2017న ప్రచురితం.

దు:ఖ పడుతున్న నేల

కాలం కరువు కళల మీద
కబలిస్తున్న కౄరత్వం
కొరిజీవునాలు నిలిపిన కన్నీళ్ల ఆవిరి
కురువని వానకోసం మొకమెత్తిన నోరు తెరిచి నిరీక్షణ

కన్నుకూ మిన్నుకూ రైతుచూపు
బతుక్కీ మెతుక్కీ మట్టిబంధం
సేద్యం అద్దిన స్వేద పరిమళం
ఘర్మజలం తడిసిన సాగులో పొడుస్తున్న ముల్లుగర్ర
తలకిందులు అవుతున్న తరతరాల భూవారసత్వం

మండే కుంపట్లను గుండెల్లో మోస్తున్న
పరువుగాయాల పైరు పోషకుని
చెదిరిపోని కలలపై చంద్ర దీపం పెట్టి
తొలిపొద్దునీ పొడిపించాలనీ కాంక్ష

నేల లోతుల్లోకి దిగి అడుగంటిన జీవజలాన్ని
మనసు దోసిల్లతో దేవి పైరు గొంతుల్పి తడిపి
పోయే ప్రాణాల్ని నిలుపాలనే నిలువెత్తు కోరిక

నిరీక్షణ చూపు ఎర్రటెండల తపస్సు
సేద్యగాడితో మమేకమై కనికరించని కటిక మేఘాన్ని
కన్నీళ్లతో కరిగించాలనీ మనాది
బాకీలసెగతో బుసకొడుతున్న అప్పులకుప్పలు
తిప్పల పడుతున్న రైతును తిత్తితీస్తున్న మిత్తి

అమాయకత్వాన్ని దోచుకునే దళారి పెత్తనాన్ని
కాచుకోవాలనే ఆలోచనల కుత్తుకలపై
వెంటాడుతున్న కరువుకత్తినీ
కనపడనీ మోసాల్ని
నామరూపాల్లేకుండా నాశనం చేయాలనే ఆశ

ఆధారం లేని రైతుకుటుంబాల్ని
కరుణించని ప్రభుత్వమ్మీద
కసితీర్చుకోవటానికైనా
కాలు దువ్వటానికైనా
సంజీవనీ పసరు పోద్దాం

రైతు మనసును తట్టి
ఆ మట్టిలో ఆశల్ని విత్తి
సుందర ఆశయాల్ని మొలిపించాలి
గెలుపుని కర్షకునికి కిరీటం చేసి అలంకరిద్దాం

ఎవడికైనా రైతుపెట్టే అన్నమే దిక్కు అని చాటడానికి
బీళ్ళు పారిన నేలను నారు మళ్ళు చేయడానికి
కాసింత ధైర్యంతో రైతును హత్తుకుందాం

ఆత్మవిశ్వాసం నీరు కట్టడానికి అందరమొకటై
రైతే రాజ్యమనీ చాటడానికి
అక్షరాలతో అన్నదాతకు ఆయువు పోసి
దు:ఖపడుతున్న నేలను పచ్చని పంట పొలంలా చేద్దాం రండ్రీ...

15.06.2016

ఇమిడి...

కుళ్ళిన తోలును
రోకలిమీదేసి సవురం చేస్తున్న సన్నకత్తి
మెదడులందలో మాగిన వస్తువును
నుల్కలా పేనితే కవిత్వం
ముచ్చటపెట్టినట్లు ఎత ఎల్లపోస్తే కథ
బతకుని బాధల పసరుపోస్తే నవల
ప్రక్రియ ఏదైనా బతుకే మూలం

చింతగింజల అంబలి
తోలు దప్పును మూసినట్లు
కుతకుత ఉడికే కన్నీళ్లనీ
వివిధ ప్రక్రియల్లో అచ్చుపోసిన బతుకు
ధమని పుస్తకమైతది

అక్షరాల చిటికె పదాల చిర్ర
తప్పెట దనులై కైగడితే
పాఠక మస్తిష్క మబ్బుల్ని కరిగిస్తది

మిగ్గులముంచి మొగ్గపూసల్ని అల్లినట్లు
మనసులు అద్ది
తీరొక్క తీగలతో పువ్వుల్ని
పదపదానికి పసందుగ అల్లుతది

పనిరవుతు మీద తోలును మద్దిచ్చినట్లు
బతుకు బందాల పదాల్ని కెలికే లయ
ఆత్మలని దేవే పాతాల గరిగే

పాదాల్నీ కప్పకుండా
కంటికి నచ్చిన మజ్బూత్ కోసం
ఏర్పడకుంట గుచ్చిన ఈతకమ్మ దబ్బనం
గతిమారని బాధల్ని
గాథలు చేసిన తండ్లాట
కవిత్వ వాహకమై
పొద్దుపొడుపుకు నివేదించడానికి
అవ్వ అరచేతిల తాల్చిన నుల్కయి
కరివెట్టిన అనుభూతులు కరిగిస్తయి
సాక్ష్యాల భావాల్ని తలదాల్చుతయి

సదువక శాతలో సగమైన మా అవ్వ
ఆగమైన బతుక్కు ఆనవాలుగా మిగిలింది
శేతలు జేసి చెప్పులు ముడిసి మా నాయిన
ఎట్టిలో తడిసి ఉట్టిచేతులతో నిలిసిందు

సదివించినందుకు నేను
ముక్వారుకు ఆందెం అద్దుతున్నట్లు
ముడి బతుకుల్ని సాహితీ పదనగా ముడుస్తున్న
తడి జిలుగుల్ని అక్షరాల తలుగుల్లో ఇముడుస్తున్న

15-5-2017.   దళిత శక్తి జూన్ 2020 మాసపత్రిక

పూర్ణం

ఆత్మవిశ్వాసం ఇంద్రధనస్సై
మంచు కొండలపైనా,
ధరిత్రి గుండెలపైనా
కంచు నగారా మోగించిన చరిత్ర
గురి గిరిగీసుకొని దీక్ష అధిరోహిస్తే
శిరసొంచని ఎవరెస్టు సాష్టాంగపడి మొక్కి
కీర్తిని ఎల్ల దిక్కులకు చాటింపు జేసింది

మునివేళ్ళతో తినిపించిన హాస్టల్
జ్ఞానారణ్యంలో ఎన్నో కలలు కలెగలిసి
ఎన్నెల పరువు నిండు పున్నమోలే కురిసింది

తెగలకు దూరమైన అక్షరం అంగాంగ వర్ణనలనొదిలి
గెలుపు నిర్వచనం నీవని అక్షరాలతో ధ్వజస్తంభం ఎత్తుతుంది
తళుకుబెళుకుల వెండితెర మేనుహొయల్ని మేసి అదమరిచేది
పరి'పూర్ణ'త 'సాహసానికి పరిమితులుండవ'నే దృశ్య కావ్యం

సాహస కంకణధారులు సదా నీ ఖ్యాతిని స్మరించాల్సిందే!
చరిత్ర సృష్టించడానికి నీ చరిత్రను చదువాల్సిందే!
అసాధ్యాన్ని అధిరోహించిన నీ యోగ్యత
తరగని నిత్య ఆమని గని

హద్దుల్లేని తపస్విలకు దేశదేశాల్లో రెపరెపలాడే
తండాల్లో ఉదయించిన జాతి ఝుండావే
మట్టిలో పుట్టిన ధృవతారా! ఏడేడు జన్మాల స్వర్ణమా
మా మలావత్ పూర్ణమా నీకు సెల్యూట్

22.03.2017. సా. 4గం.లకు

వేడుకోలు

బిడ్డలారా!
నిర్దయ కాలం
ఎడవాపిన తల్లి కోడిలా
విధి మనల్ని విభజిస్తుంది.

మన బడి పరివర్తనశాల
ఫలితం కోసం
పురిటినొప్పుల తవుసుదీస్తున్న జ్ఞానశోధన
అధ్యయనం, అధ్యాపనం
భక్తి శ్రద్ధల భవిష్యత్తు వెతుకులాట

ఆట పాటలతో కళల ప్రదర్శనల నైపుణ్యత కలగలిపి
అవమానాల పొగరొంచిన విజయాల్ని నెమరేస్తిమి
ఆత్మ విశ్వాసం పరి 'పూర్ణ' ఎవరెస్టు కీర్తిని జపిస్తిమి
లక్ష్యం గురిపెట్టి నిర్లక్ష్యం శాసిస్తి

అప్రమత్తతే కీలకం
శాంతికపోతాలని ఎగురేసి వలపన్నే వేటగాళ్ళని
తలదన్నాలనే తపన
గొర్రెతోలు కప్పుకున్న తోడేళ్ళలా
కాలేజి కాలం కైపుగా కవ్విస్తూ
కంఠశోష మిగిలిస్తుంటది
గంగ చల్లనిదే గట్లు కోస్తదని తెలుసుకోవాలె
"మేకల్ని కోసే సమాజంలో పులిలా బతుక నేర్వాలే"

తొవ్వలో అగుపడని పల్లేరు కాయలు
కుళ్ళు పోటురాళ్ళయి అణువణువు గుచ్చుతుంటాయి
పడితే గాని గుంతలోతు తెలువది
గుణం తెలుసుకునే లోపల గూడుపుతాని మర్మం
బతుకంత కోలుకోలేని వాతపెడుతది

రంగుల ప్రపంచం రమ్యుగా కనవడుతుంటే
ఆశల ఉరులకు చిక్కేది మనసు
నిన్నుగా నిలిపేది నీ స్వీయ నియంత్రణే

కన్నీళ్ళలో కత్తులు దూయడానికి
బాధల్ని గాథలుగా మార్చడానికి
జ్ఞానకవచానికి విచక్షణ తోడవ్వాలి
అగ్ని కాల్చని, నీరు ముంచని
నిత్యయవ్వని ఆత్మస్థైర్యం మీకిస్తున్న
దీనికి విరోధంగా రూపించిన ఏ ఆయుధం వర్ధిల్లదు

సమానత్వ సన్నిధిలో
సమతా వినువీధిలో
మన్నిక మానవత్వాన్ని అద్దడానికి
మనుషులుగా తీర్చడానికి
విశ్వసేవకై సదా వేడుకోలు

3.03.2017

నవతెలంగాణ ఆదివారం సోపతి 19.03.2017లో ప్రచురితం.

మనుగడ రణం

శిథిల శకలాల చరిత్రలో
బానిసత్వాన్ని మోసిన ధరిత్రిలో
అక్షరాలకు దూరంగా
విసిరేయబడిన దుర్బలజాతికి వారసున్నై
కాలం కాగితమ్మీద సలసలకాగే సమాకార సిరతో
చెరిగిపోని సంతకం చేస్తున్న

నా పూర్వీకుల వల్ల దారి మలినం కావొద్దని
ఉమ్మివేయకుండా మూతికి ముంత
ముడ్డికి ఆకుకట్టి
చరిత్రను నా వాళ్ళతో తుడిపిన ఖర్మను
మనువాది కులవివక్ష ముందు నిలబడి
బాబా మార్చిన అక్షరంతో బాహాటంగా
కలం కత్తిచేసి సంతకం చేస్తున్న

నా అయ్యవ్వ వెట్టిలో మునిగిన మట్టిమనుషులు
కులరక్కసి ముందు నిలిచిన పశుహీనులు
వెట్టిమీద తిరుగుబాటు సారెపై
వెన్నుతట్టి నన్ను ఆవిష్కరించారు
వారి ఆకాంక్షలనై
ఆశయాలను ఆద్యంతం సంతకం చేస్తున్న

విజ్ఞాన కాగడా అందుకున్న
చిమ్మ చీకటి బాటసారినై

జ్ఞానకాంతుల్ని పూయించటానికి
సందేహ విద్యార్థి జనసందోహాల మీద
నివృత్తి సంతకం చేస్తున్న

శోకాలు కల్గించిన శ్లోకాల సాక్షిగా
పరిహసించిన పదాల వాదాలమీద
శిక్షించిన ఆ అక్షరాలతోనే
పుటం వేసిన అవమానాల కొలిమిలోంచి
సాహిత్యం అందరిదని చెప్పటానికి
కైగట్టి ధీటుగా చేవ్రాలు చేస్తున్న

రాలిపోయే కలలు చిగురించడానికి
నిరాశ్రయుల నిరసనలకు మద్దతు ప్రకటిస్తూ
పోరు ఆజ్యమయ్యేందుకు అవిభాజ్యంగా సంతకం చేస్తున్న

అమరుల త్యాగాలను మనసులోకి
ఇంజెక్ట్ చేసుకొన్న బానిసనై
సమానత్వమే సంగీతమనీ
మానవత్వమే సందేశమనీ
నిరభ్యంతర స్వేచ్ఛకోసం
పోరు దస్కత్తు చేస్తున్న

మొద్దు మెదడుపైన, పొడిచే పొద్దుమీద
నడిచే సూర్యుని మీద రగిలే సంతకం చేస్తున్న
నా సంతకం శిలాశాసనం
జ్వాలా తోరణం
మనుగడ రణం

2.9.2015 , రాత్రి 10.30
ఎనగర్ర కవితా సంకలనం.
అరుణతార ఫిబ్రవరి 2016

తిరుగబడుతున్న సిరా

ఒకప్పటి అవార్డులు
ప్రస్తుత తిరస్కార శరాసనాలయి
వ్యతిరేకత సాకవోస్తూ
దిక్కులు పిక్కటిల్లేలా ధిక్కరిస్తున్నాయి
వెంటాడే మూర్ఖత్వం వేలాడే కత్తి
అసమానతలపై ఆజ్యమవుతున్న
అభ్యుదయాల్ని మింగజూస్తున్న అమానుషులు
ఉత్పాతం సృష్టిస్తాయని
అక్షరాల ఉత్తేజానికి ఉరి బిగిస్తున్న దుర్మార్గం
రాహుకేతువుల్ని పెంచుతున్న రాజ్యంలో
రచయితల రక్తంతో తడిసిన చరిత్ర
ఎప్పటికీ గాయపడ్డ గ్రంథమే
నిజం గళమెత్తినా,
నియ్యతి కలమెత్తినా
కదిలించే మేల్కొల్పులపై కక్షకట్టిన నిలువెత్తు నిఘా
నెత్తురు తాగమరిగిన మాయపాలనపై
విముక్తి సంగీతం విన్పించడానికి
స్వేచ్ఛకోసం అక్షరాలే ఆవాజ్‌లయితయి
నిగ్రహాన్‌లపై నిప్పుల కొలిమిలో ఉప్పు
రగులుతున్న భారత్
తిరస్కరించే నింగిమీద తీరొక్క రంగులు పొడిసిన సింగిడి
ఆందోళనలు హత్యలు చిమ్మిన నెత్తుటి అక్షరాలు
నిరసన చల్లుతున్నై నిర్భంధాల్నీ నిరోధించడానకి
ధిక్కార పతాకమై దిగంతాలకు వ్యాపిస్తున్నై

22.10.2015 ఉ. 10.30 నడుస్తున్న తెలంగాణ 2016 ఫిబ్రవరి

ఊరుకుతి

ఉద్యోగ జీవనం ఊళ్లు మారేకొద్దీ
అలజడి మనాదై ఊరుమీదికి ఉప్పెనైతది
మూలం మూటగట్టిన పల్లెలో అనుభవాలు
యాతం బొక్కెన
ఎల్లిపారుతున్న ఎతలు
తవ్వినాకొద్దీ మతిల ఉబికే ఊటమడుగు
పెద్దగుండు వాగు పారకమోలే పొర్లుతది

కాంతుల్ని మింగి గలగలపారే వాగు నెమరుల
పాకురు గుంతల్లో జెల్లచేపల పరాచికాల మెరుపులు
ఇసుకల కట్టిన పిట్టగూళ్ళ గవ్వల ధ్వని కీచు కేకలు
మురిపాల మువ్వలయిన గురుతు ప్రతి ధ్వనులు

కోడూరుబాటల రాకపోకలు
తోడిన సెలిమెల్లో మోకాల్లపై తాగిన తురితి
అడుగులో అడుగేస్తూ
చేతులు గాలాలయి చేపలు పట్టిన చెరగని మరుపు

మోదుగాకు దొప్పల దోసిళ్ళతో
దూపలు తీర్చుకునే కుతికి బొందితో కైలాసమంత సంబూరం
కల్లుదాగి కైలాటకం ఆడంగ మందువంత పండుగ

బాగోతులు, జులూస్‌లు, సర్కస్‌లు
కుల మతాలకతీతంగా పెద్దపట్నం ఎక్కినట్లు చావిడి
తప్షలు, శిగిష్టలు జాండ చుట్టూ తిరిగే జీవితం
సూర్యుని చుట్టు తిరిగే భూమిలాగ ఉంటది

ఊరెత్తిన బోనం, శ్యాందిరి కింద కిరీటంలోని వజ్రపు వెలుగులు
ఫకీర్ల యేషాలు, అసోయిదూలా ఆటలు
దసరా అలాయి బలాయిలు, క్రిస్మస్ వందనాలు

గురి నూరిపోసిన బడి గురువుల బోధ
ఖండాంతరాలకు వ్యాపించిన విద్యాపరిమళం
నిలివెడు దీవెనలు కురిపించే ఊరు మనసార హత్తుకునే కన్నతల్లి

సిర్రగోనె, గోటీలు, పత్తాలాట, చారుపత్తలు
మంచిల్లబాయి మోటసిమ్ముల తెట్టె నేర్పిన సాహసాలు
పొరుగూరి మీద క్రికెట్ పోర్లు సిక్సులు కోహ్లీకేం తీసిపోవు
గాలిలో దూసుకొచ్చే వాలీబాల్‌షాట్‌లు
గురుతుకొస్తే మనసుకలికలి

వాగు పారకమోలే మనసుతడి హత్తుకుంటది
పెద్దగుండు వాగు ఊరిసుట్టాల కాళ్ళు కడుగుతది
దూది అంతా మెత్తటి మనసులు
రేషం రోకండ్లు పలిగే రోనీ ఎండ
కల్లు మత్తు ఊరే గమ్మత్తు ఎన్నీలోలే ప్రేమ ఎగజల్లుతది
తప్పులు దొర్లితే నిప్పుల కుప్ప ఘనమైన బోలాతనం మా గోనెపల్లి
ఎంతో మందికి కల్పవల్లి

ఆపతి సంపతి తెలంగాణ లడాయిలో
మా ఊరు సుట్టూ నాలుగూల్లపెట్టు
పట్నంల ఎన్నొద్దులున్నా పానంగుంజేది
నన్నుకనిపెంచిన ఊరిమీదికే

కొలిమి అంతర్జాల పత్రిక అక్టోబర్ 2019.

రేడియేషన్ జ్వాల

మనమిపుడు మనలో ఉన్నామా?
వ్యసనపు దాసులమై మార్కెట్ మాయాజాలంలో
నొప్పితగలకుండా గాయపడుతున్నా
సోయికి వస్తలేం

సరానికి వేలాడుతున్న వరిగొలుసుల్ని
ఒలుచుకబుక్కే ఊరపిచ్చుకలు
కుటుంబ సభ్యులై మనతో పరాచకాలాడేవి
ఆ వింతశబ్దాల్లో సంబూరం ఒలలాడేది
కనపడని శత్రువేదో బహుశా మనల్ని విభజించింది

సేవ ముసుగులో కంపెనీ సాంపిల్‌గా
రేడియేషన్ మనల్ని బానిసలుగ మార్చుతున్న వైనం
మన ఆలోచనల్ని తన గుప్పిట్లో పట్టిన లంకినిశెంకినై
నమలకుంట మింగుడు సురువుజేసింది
బలహీనత గాలిసోకే ప్రతిసూది మొనమీద
రేడియేషన్‌పన విస్తృమవుతుంటే తప్పించులేక తండ్లాడుతున్నం

మనిషంటే సెల్‌ఫోన్
మనసంటే టచ్‌స్క్రీన్
ఆపదలో ఉన్నవాని ఫొటో అప్‌లోడ్‌చేసి
లైక్‌లకు, కామెంట్‌లకు నిండా మునిగిపోతున్న వ్యసనం
ఏదీ లేకున్నా నో ప్రాబ్లం
స్మార్ట్‌పోన్ మస్టు
ఛాటింగ్ చెయ్యకుంటే వేస్టు

గమ్యం కోసం అరచేతిలో వైకుంఠం
గాల్లో తేలిపోతున్న గమనం
రెండంచుల ఖడ్గంతో ఏర్పడకుండా కోస్తున్న మాయ

మనసు ఒక ఆన్‌లైన్,
మనిషి ఒక హాఫ్‌లైన్
గ్రాఫిక్స్ ఇచ్ఛంత్రం
లైఫ్‌కి సఫిక్స్, అఫిక్స్ అయి
మొఖంలేనోడు ముఖపుస్తకంలో అతికిస్తుంటడు
నమ్మిన మనసుల్ని బతుకుల్ని చిదిమేసే గారడీ విద్యలో
స్క్రీన్ మీద వసంతం తప్ప వేలాడుతున్న తన చావూ కనవడది

అంతా మంచిదే
మంచిది కానిదే మనసు
వ్యాపారికీ నెట్‌వర్క్ తోడైన సేవలు
అనవసర క్లిక్కుతో బతుకు లూటీల ఏడుపుల పెడబొబ్బలు
జీవితం రేడియేషన్ ఉచ్చులో చిక్కుకొన్న అంపశయ్య
అది విద్యుత్ షాకయి మనల ప్రాణాల్ని జుర్రుకుంటది

జీవజాలాన్ని అంతంజేసే తరంగాలకి వంతపాడుతూ
బహిరంగంగా బలిపీఠమెక్కుతున్నం
మండుతున్న జ్వాల మనల్ని నియంత్రించకుండా
మనమే శాసిద్దాం
నియంతను నిలవరించి స్వేచ్ఛను శ్వాసిద్దాం

07.07.2015

అక్షర లక్ష్యగాన్ని

పిల్లలూ!
తలరాతలు మార్చే చూచిరాతలు చూపండి
నా చుట్టూ పిల్లల మానవహారమయ్యారు
పరిశీలనగా సూచనలిస్తూ నేనూ

"స్థబ్దంగా ఉండే మేం,
మీ క్లాస్‌లో నవ్వుల పువ్వులమైతం
తరగతిగది ప్రపంచమై స్వేచ్ఛగా ప్రశ్నిస్తం
దేన్ని బోధించినా ఏదో సాధించినట్లనిపిస్తది
సార్ మీ క్లాస్ మస్తుంటది"

"మీదో భ్రమ
'మ', 'య'కు తేడా ఉండాలిగదా?"
"ఓ. కే సార్, మార్చుకుంటం సార్
మీరేమనుకోనంటే
మీదే కులం సర్"

నా సందిగ్ధత పద్మవ్యూహమైంది
'తెల్లకాగితంలాంటి మనసులు మార్చుతున్నావా? మానవ విరోధి
కులాన్ని నిరోధించడమెట్లా?'
"సారోల్లు రెడ్డీలన్నా కావాలి
కోమటోల్లన్నా కావాలి" సన్నగా ఓ గొంతు ఊహ

"కులమతాల జోలి మనకేలా?
విశ్వనరులమై విరజిల్లాలి" అనే జాషువా పద్యం

గురజాడ గుణము ముఖ్యమనే
శ్రీశ్రీ మానవుడే నా సందేశమనే
విద్యార్థి గుణగణాలను తీర్చిదిద్దే నేనొక గురువును

అభ్యసన కార్మికున్ని
బోధన నా ప్రాణం
సాధన నా లక్ష్యం
మిమ్మల్ని భవిష్యత్తు చేయడం నా బాధ్యత
అంతరాలు లేని సమాజం నిర్మించడం నా విధి

"ఎన్నో చెప్పుతుండ్రు గని అడిగింది దాస్తుండ్రు సార్?"

నా ప్రియ విద్యార్థులారా!
మనల్ని మనం దూరపరుచుకునే బలహీనత
కులం కుళ్ళు,
మతం ముళ్లు
అదొక మలకబలనం
అంటుకుంటే చికిత్సలేని రోగం

ఐనా వివరిస్తున్నా చదివితే నాలుకల్ని తెగ్గోసే
వింటే సీసం పోసే వ్యవస్థలో బాధితజాతి నాది
అణిచివేతల వెక్కిరింపుల్ని ధిక్కరించి
అక్షరాలను వెదజల్లిన సావిత్రిబాయి పంతులమ్మ వారసున్ని
బోధించి, సమీకరించి పోరాడుమన్న నిలువెత్తు సాక్ష్యం
ఆత్మగౌరవాన్ని చూపించే అంబేద్కర్ అక్షర లక్ష్యాన్ని
ఆచరణ వాదిని

28.08.2016 రాత్రి 11. గం. లకు, నేటి నిజం సాహితీ కెరటాలు 15.02.2017

రైతుకోసం

పిడాత జీవునం తీసుకునే బక్కరైతుతో ఏడుస్తూ
బతుకు ఆశల్ని నూరిపోయాలని
దివాళాదీసిన రైతుకు బతుకాలనే కసి నింపాలని వుంది
అప్పురంది అరికట్టడానికి అవమానాలని అడుగుతొక్కాలని
నిందల బొందల్ని నిలువెల్ల ముంచాలనీ
రాలిపోవాలనుకునే బతుకులో
రగిలే ధైర్యం నింపాలని వుంది
అధికార దాహంతో వర్షించే ఎన్నికల హామీలను
అవసరపూర్తిగా రంగులు మార్చే రంకునేతల లీలలను
రక్తికట్టేలా రాసి రొంపిలో మునిగినోళ్ళకు ముక్తి కలిగేలా
విముక్తి సంగీతం వినిపించాలనీ వుంది
పథకాల పంపకాల్లో పక్షపాతం
కుట్రల కమీషన్ల కక్కుర్తి స్కాంల్లో అనర్హుల భాగస్వామ్యం
రైతులకు లెక్కచెప్పి హక్కుదారుల్లో చైతన్యం నింపి
ఉక్కుసిచ్చు బుడ్లుగా ఉసిగొలుపాలని వుంది
కరువు రాకాసి కోరలు కాలకూట విషం చిమ్ముతూ
ఆరుగాలం శమటని ఆరగిస్తున్నపుడు
నెర్రెలు పారిన నేలలో జీవిడుస్తున్న రైతుల్లో
భరోసా వాననై కురువాలని వుంది
నకిలీలు నట్టేట ముంచుతున్నపుడు పెట్టుబడిదారి పంచనచేరి
సర్కారుపై ఓట్ల తిరుగుబాటు ఎగరేసి
రైతు వ్యతిరేకతను ఎండగట్టడానికి మంటపెట్లాలనివుంది
ఆకలితీర్చే అన్నదాతల
ఆత్మహత్యల పరంపరను అరికట్టాలని ఆశ
సేద్యగాన్ని అసాధ్యన్ని చేయడానికి అక్షరమై వెళ్తున్న

04.01.2015 ఉ. 4గం. లకు నేటినిజం 17-09-2015

బతుకమ్మ

బతుకు శాందిరి కింద ఆడలేక మద్దెల ఓడింది
పువ్వు తెంపుకొచ్చి ఇచ్చిన బతుకు
తరతరాలుగా నవ్వుల పాలైతనే ఉంది

బతుకే లేదు
బతుకమ్మ ఎక్కడిది?
ఎండుగే లేకపాయె
పండుగెట్లుంటది?
దిక్కు లేకపాయే
ఏ దిక్కు సూడుమంటవ్
దేవుని సూపే ఆగరవాయే
నరుని సూపు సక్కగుంటదా?

బక్క పానానికి ఒక్క చేత దూపారది
దరిలేని బాయిల తొక్కులాట దేనికి?
ఎదురుకొచ్చి బతుకమ్మ ముంగట
ఎగిరి దుంకిన సంతోషం దనులైనట్లే ఎగిరిపోయింది

రంకురాట్నమోలే చుట్టూ తిరిగి ఆడుతుంటే
మీ మురిపాల మెరుపులకై
మమ్ముల్ని మేం మరిసిపోయినం
తాడై, తలుగై, ఎర్రమన్ను వన్నెలై
ఎట్టి మాదిగ బతుకు కొనాఖరికి ఉట్టిదే

పండుగ పలారం దప్పుకుదురులో
దయాగుణం చెయ్యేత్తితే ఆశ కొసురుతది
దానం కర్కశంగా కసురుతది
మలీదలు మక్కట్కులు,
పప్పులు బెల్లాలతో
బతుకే ఒక పోరాట భావుటా

దులిపినా వదులని బూజు
కర్మ పెట్టినదుర్మార్గపు కుట్ర
దొబ్బ ఎత్తుకపోయిన కాకి
మనకు లేకుంట చేసిన బతుకమ్మను
మాయితనపు మంగుళపు పెంకను
మూడు బజాట్ల ఎత్తేసి
తాడు తెంపుకొని
పాడు వ్యవస్థను పగులగొడుదాం

అనుభవాల బతుకు మనది
ఆడితే ఒడువని జీవితం
మనసుల్ల అతికే బతుకును
ఆత్మగౌరవంతో ఆడుదాం
ఆట పాట అందరిదని చాటడానికి
బహుజన బతుకమ్మ ఆడుదాం

12.10.2015

బహుముఖ వ్యాఘ్రం

కత్తులు దూయడానికి కర్కశత్వమే అవసరంలేదు
కనపడని ఎత్తులు చాలు
కుట్రలకు మితిలేదు
మతోన్మాదానికి పరిమితీ లేదు

ముద్దపప్పు శాకాహారి తత్వం
మతవైరస్
కుత్తుకల్ని కోస్తున్న తేజైన కత్తి
తరతరాల అలవాట్లను ఒడ్రంగా కోస్తుంది
మోపిన ఆరోపణ ఆక్లిక్‌ను గావుపట్టింది

గొలుసుకట్టు ఆహారవ్యవస్థలో నోటికి చిక్కెం తగిలించి
కోసుక తిన అమ్ముతుంది
తినవోయే మనిషి గొంతికెల్ని చీరుక తింటది
నోటిముద్దకు హద్దులు గీసే హక్కులు ఎక్కడవి?
అలవాట్లు నియంత్రిస్తవా?
ఆగమైతవ్
ఏదీ పులికి చెప్పు
గడ్డితినుమని

పాలు, పెరుగు, నెయ్యి,
ఆరోగ్యం కోసం ఔషధంలా
ఆవుచ్చ తన్మయత్వంతో తాగేటోళ్ళు
మనదీ గో సంస్కృతి

గోవు గొప్ప సాదువే
గోరాజకీయమే ఘోరం
దేశభక్తి పేరున ఉసిగొలుపుతది
బహుముఖాలుగా గాండ్రిస్తూ
చావు హుకుం జారీ చేస్తుంది
'ఈ దేశం – గోమాంస రహితం
గోభక్షణ శిక్ష – మరణం" అని రూపమ్మారిన మనువు
మనుషుల్ని అలాల్ జేస్తుండు

తినుమని అంటగట్టిన కులవృత్తి
తుక్డల్ తుక్డల్ నరకబడుతున్న పానం
మనుషులు తినే గోవు
మనిషి నెత్తురు జుర్ర మరిగిన
రక్తపిశాచితో జతకట్టిన శాసనం

మనువు కుతంత్రాలకు తలొగ్గిన కులాలు
సచ్చిన పశువుల తోలు దీసినందుకు
మెచ్చుకున్న సమాజం
అదే పనికి కసాయితనపు కత్తికోత ఎందుకు?

పశువుల్ని పూజిస్తూ నరబలి
అలవాట్లపై విరిగిపడుతున్న విషపు కొండచరియలు
ఆవుపేరున హత్యలు చేసే గోసంతతీ!
కలెబడడానికి పనికత్తులు ఆరెలు
పశువుల్ని కాదనీ మనుషుల మీదికి నూరితే ఎట్లా?

(18.10.2015, 10 గం.లకు; 2002 హర్యానాలోని జజ్జర్ లో చర్మకారుల ఊచకోత నుంచి ఆక్లిక్ వరకు గో హత్యలకు స్పందించి)

రోహిత్ మరణం

పగదారుడైతే పక్కాగా ఎదుర్కోవచ్చు
శత్రువు ఎదురయితే అంతు చూడవచ్చు
దొంగదాడి చేస్తూ అస్త్రాల్ని సంధిస్తూంటే
ఎదుర్కోవడమెట్లా?

గమనాన్ని గమ్యాన్ని
ఘడియ ఘడియకు గతి మార్చుకునే
కులపిచ్చి వైవిధ్యం
చికిత్సకు లొంగని మొండిరోగం
బహుముఖాలుగా తలపడుతుంటే
ఎదుర్కోవడం ఎప్పటికప్పుడు నేర్చుకునే విద్య
ఎంతకీ అంతుపట్టది?

విపరీత బుద్ధి వివిధ రూపాల్లో
మనిషి మీద దాడి చేస్తే భరించవచ్చు
మనసుమీద దాడిచేస్తే మసలుకోవడమెట్లా?

వివక్ష అవలక్షణాల కలబోతతో కలిసిన
మనువాదము హింసావాదమై
పెనువివాదాలను పెంచిపోషించే
కుతంత్రాల కుళ్ళు మారుతుందంటే భ్రమ?

అంతరం మారది కుల వ్యామోహం తరగది
వివిధ వ్యూహాలను పదునుపెట్టి
పగ ప్రతీకారంతో పద్మవ్యూహం రచిస్తుంది

కులపిచ్చి బతుకుల్ని విచ్ఛిన్నం చేసే పథకాలు
పక్కగా అల్లి చిలుక పలుకులు
గున్కపువ్వోలే తలనెరిసినా ధోతికుచ్చిల్ల సైగలు
బడుగు కుతికెలపై అధికారం ప్రయోగిస్తది

బడుగు విద్యార్థుల్ని కష్టాల పాల్జేస్తున్న పక్షపాతం
ఆచార్యుని ఆధునిక పాదమై
పాతాళం తొక్కడమే పరమావధి

కుల మత్తు కలల సాకారాన్ని
నిరాకారం జేసే విపత్తులు
నీతులకు గోతులు దీసి
మూతులు నాకే ముసలి అక్షరాలు
మొగ్గలని నలిపే అధికార ముద్రికల అర్రులు

వికసించే రోహితులను
అదృశ్య ఆయుధాలతో మనువుగాల్లు చేసే హత్యల్లో
ఆత్మహత్యలని బుకాయింపు

రోహిత్ మరణం ఆసేతు హిమాచలం
ఒక రణం
అగ్రకుల ఆధిపత్యమ్మీద ఉగ్రరూపం

(27.1.2016సెంట్రల్ యూనివర్సిటి హైద్రాబాద్‌లో పరిశోధక విద్యార్థి వేముల రోహిత్ ఉరివేసుకొని మరణించినందుకు స్పందించి. బహుజన కెరటాలు మాస పత్రిక వేముల రోహిత్ ప్రత్యేక సంచిక)

ఆశల అలుగు

పాలకుతి పసిపిల్లల ఎక్కిల్లు
కరువుల రైతు కన్నీళ్ళు తుడిచే అలుగు
పొలాల గొంతు తడిపే కన్నతల్లి
మా ప్యాట చెరువు సుట్టూ ఆమెడ పెట్టు

చెరువు మత్తడి దుంకితే నీళ్ళ గలగలల శబ్దం
పాలనురుగుల కాల్వల పారకంలో
జెల్లలు గల్ల ఎగురవేస్తూ మెరుస్తుంటయి
ఆకలి వేట వలల దేవులాటల బతుకు
ఒడుపు నేర్చుకుంటది
బీడుభూమి బీజభూమిగా మారుతది
ఎండిన పొలాలు నిండు చూలాలైయితయి

పొలిమేర్లో పొలం వాసనలు
ఆకుపచ్చని చీర కట్టి చల్లటి గాలై వీస్తూ
బాటసారులకు శిరసొంచి నమస్కరిస్తుంటయి

సకల జీవరాశుల సారం చెరువే బతుకు దెరువు
మా చెరువు ఆట పాట కరువును నిర్వీర్యం చేస్తూ
పంట పొలాలు పల్లెలు ఆశల రాట్నమై తిరుగుతయి

కల్లం
ఎముక లేని చేయితో
దానం కొలతలేని శాటయితది

కన్ను నిండిన కడుపు కీర్తిని
వసంతగానమై వినిపిస్తది
ఆత్మతత్వ సూక్తుల అనుబంధాల కలబోత
'పంట పండాలె గని తింటె దంగుతదా?'

కొత్తంత పండుగ – అల్లుడంత సుట్టమనీ
ఆత్మీయత ఎగజల్లే పంట
మమతల్ని ఎదకు అద్దుకుంటది
రైతు రక్తాన్ని తాగుతున్న దళారిజెనగ
కింటాల్లకొద్దీ మోసంతో కొంటుంటది

చెరువు కరువు నోరు తెరిచినపుడు
బతుకు బరువు మంటగలిచే పరువు
ఆకలి పోరు బతుకు ముండ్ల బాట
ఇండ్లకు ఇండ్లే వలస
ఖాలీ అయిన ఊరుచూసి
గాజుకళ్లతో వానకోసం ఎదురుచూస్తది ముసలితనం

మా బలమూ బలహీనత చెరువు
సామూహిక జీవన విధానం
సంస్కృతి
సాంస్కృతిక వేదిక
భరోస
బతుకు
మా చెరువే మా ఆదెరువు
నిండితే కస్తూరిపల్లి
ఎండితే కన్నీళ్ళపల్లి

26.12.2015

సంచారం - సంచలనం

ఇరుసు చుట్టూ మొండి బతుకు
ఇరాం లేకుండా తిరుగుతది
ఆశ చావది
బతుకు సాగది
ఐనా పోరాటం తప్పది

ఎండలో మాడే జీవితం
వొశపడక వొగరు కొడితే
జాడలేని నీడ కావాలనే మాయమైతది

ఈదురుగాలి వానకి
నిదుర డేరాతీరు రెపరెపలాడతది
ఎముకల్ని కొరికే చలి కిరికిరి
పిడికిట్లో బంధించబడుతది
మూడు కాలాల్లో డేరాలు గుడారాలై
కవర్లు కవర్ చేస్తయి

పొద్దు మాపు
బతుకు అంతా మలుగని చీకటి
పయనం బతుకు కొనసాగుతనే వుంటది
సంచారం అలుపెరుగని ప్రక్రియ

పచ్చని చెట్లు ఊరూరికి
ప్రేమను ధ్వజముగా ఎత్తుతయి
ఆకలి ఆవురావురంటుంటే
కడుపు తిప్పలకు జేరిపోతులాట

అడుక్కుతినే గోడు,మెడమీద జోడు
తృప్తిలేని జీవితం
కడుపార తినది – కన్నార పండది
మనసార ఎక్కడా ఉండది

ప్రభుత్వాలు మారుతయి
బతుకులే మారయి
బతుకాలనే కోరిక వెదురువనంలా పెరుగుతుంటది

కలలు లేని ఎన్నికలలు
అవసరాన్ని బట్టి ఓటరు లిస్టులో వేటుపడ్తది
దారం ఆధారం లేని ఆధార్‌లు నిరాధారమైతయి

లింక్ లేని బ్యాంక్‌ల్లో వంకర సబ్సిడీలు
కదిలే కాలమ్మీద బతుకు దౌడుతీస్తది
పోరుమీద పోరే జీవితం
చంచలమైనది సంచారం

విడివడ్డ జాతులు ఎన్నో కలసి ఏకమవ్వాలి
బతకటం కోసం చేస్తున్న సంచారం
భవిష్యత్తు కోసం భావితరాల కోసం
బతుకులు మారటం కోసం చేయాలి
మీ చలనమిపుడు సంచలనం
నేడు వెతికే రేపటి బతుకు సాంచ

04.11.2015 రాత్రి 10 గం. లకు, 3-3-2016 నేటినిజం దినపత్రికలో ప్రచురితం.

వ్రణం తీర్పు

నీచాతి నీచమైన ఊచకోతల చరిత్ర శిఖలో
చుండూరు మానని రాచపుండు
తెగిపడ్డ తలలహారంతో నిల్చున కులకాళి
గుడిసెల మీద చిత్రకన్ను తెరుస్తూనే వుంది

దళితుల రక్తం తాగిన కులగర్వ దాహం
వెలివాడకు దిద్దిన వైధవ్య స్మశానవైరాగ్యం ఇంకా తాండవిస్తుంది
పోరుమంత్రం జపించే యువత రక్తం ఉడికి ఉడికి సల్లారినా
లోలోన ఉద్రేకం ఉప్పొంగుతున్న మనసులు

ఆత్మగౌరవాల్ని అడ్డంగా నరికి
ప్రశ్నించిన బతుకుల్ని కూల్చిన అనాగరికతకు ఆధునిక రూపం
జనచైతన్యం అక్రమమనీ పెత్తనం మనుషుల్ని పోగులేసింది
మాంసపు ముద్దల్ని సంచుల్లో నింపి మూటల్ని ముంచిన పారకం
నీటి అలలపై త్యాగం నెత్తురునీళ్ల గాలి గత్తర కౌసువాసన
జాతి నరనరాల్లోకి పాకింది జాగృతి

కాలం కరిగినా కరగని కన్నీటి జ్ఞాపకాల జ్వాలలు
ముప్పైఏళ్లుగా కమురువాసన కన్నీటి సుదులైనయి
కమిలిన బతుకుల్లో కుములడానికి మనసే ఎడారాయే కన్నీరెక్కడ?
నింపుకున్న కసి నీరుకారినంక అంతా నిర్వేదమే

అంధకారతీర్పుని విన్న వెలుతురుగాడు చీకట్లను కప్పుకున్నడు
మౌనప్రవాహంలో ఏరు అధర్మమని గలగల పారుతూనే ఉంది
అక్రమమని వాదించలేక మానవత్వం ఆక్రోషిస్తుంది

కద్దర్ బట్టలు ధరించిన దున్నలు కళ్లజోడు సవరిస్తూ
న్యాయమని వొయ్యారంగా వొగరు కొడుతున్నయి

****

సమానత్వ స్ఫూర్తి దాతా తండ్రీ!
అంబేద్కరా!
నీ మాటలు నిజమైతన్నయి
లోపించిన చిత్తశుద్ధికి రాజ్యాంగం జీవిడిస్తూనే వుంది
సచ్చిన దోషులకు శిక్షలు వేసిన కోర్టులు
తీర్పు పెన్నులు దులుపుకున్నయి
మూకదాడుల్ని చోద్యంగా చూస్తున్న యావల
అలవాట్ల గొంతుల్ని జీవిదీస్తున్న జాగల
పెద్దగీతల ముందు చిన్నగీతలా కనబడే
చుండూరు వ్రణం తీర్పు
మరుపురాని మా రణహోమం

సమాధితోటలు ఏపుగా పెరుగుతున్నా
త్యాగాలే స్థూపాలై పాదాలకు వెలుగులైతయి
అమరత్వం నిత్యగానమై నినదిస్తూనే ఉంటది
వాదించే సోయి లేదా?
బాదల బంధీలేని బతుకుతున్న శవానివికా...?

(21.08.2015 ఉదయం 4.15గం.లకు ముప్పై ఏళ్ల తదనంతరం చుండూరు తీర్పు విని)

ముల్లె కట్టిన సూది

నిరంకుశం నిలువెత్తుగా నీలుగుతున్నపుడు
నివురు కప్పిన నిప్పోలే మేలుకొలిపితివి
అక్షరాల జమిడిక వాయిస్తూ
తప్పులపై చాటింపై ధ్వనిస్తివి
మెదళ్ల కుదుళ్లని పూయిస్తివి

తెలంగాణోన్ని మాట్లాడుతున్నని తెగువతో
ఎద మొగిల వాదాన్ని మొలిపించి నిజం నిలువాలంటివి
కనపడని కపటపు ముండ్లను
తెలంగాణల తండ్లాటలు వద్దని బోధిస్తూనే
కోట్లాది ప్రజల కోసం కొట్లాడితివి

నీవే అక్షరసైన్యానికి 'నడుస్తున్న తెలంగాణ'ను
ఒయి దోసిళ్లతో గొంతులోకి ఒంపినోడివి
సామూహిక వచన నినాదమైనోడివి
గుంపులో ఉన్నోడివి నీవెట్ల ఒంటరివి?

కేసుల ముంపు నిన్ను తాకవు
అధికార జ్వాలలు నిను తాకవు
రంగురుచి వాసనను పసిగట్టే నిన్ను చూసి
పీటమెక్కిన నాగన్న బుసకొడ్తుండేమో

ప్రజాతీర్పును ప్రభావితం చేసే
నీ కలం, నీ గళం హాలాహలమని
చైతన్యపు కొరుకుడు పడని కొర్రాయిగా భావిస్తుంది కావొచ్చు

కుతంత్రపు మంత్రాంగం నిన్ను నియంత్రించాలనే చిత్రణ
నిన్ను నియంత్రించాలనీ రువ్వుతున్న ఆరోపణలు రాళ్లు
పంజరం బంధించాలనీ నోరు తెరుచుకుంది

నిన్ను ముల్లె కట్టాలని బట్టలు బమిసి పడుతున్నె
నీవు చీల్చుకొని వచ్చే సూదివనీ
నీ బోధ మేల్కొల్పే పరిమళంలా వ్యాపిస్తుందనీ భయపడుతుంది
మసిబూసే రాజ్యాన్ని, మాయమాటలను నిలదీస్తూ
వాస్తవాన్ని వివరించే నీ వొక వాసైన మీటవే

నీవు ముందున్నవు నీ వెనుక జనవనమున్నది
అక్షర గణమున్నది
కనిపించకుండా వినిపించే కవివి
ఆత్మగౌరవాన్ని మండించి వక్తవి
తలొంచని వెదురు వనాన్ని విత్తే మేధావి ముద్రనీది
పోరుకేకవై ప్రశ్నలు వేస్తూ జవాబులు చెప్పేనీకు చుట్టూ పజలున్నరు

పురిటి నొప్పుల ఆపతిదీస్తూ సమాజం కన్నబిడ్డ కాశీం
సంకెళ్లతో వశం చేసుకుంటే సమాజమంతా ఒక్కటైతది
సమాజం కోసం ఒక్కడు ఒక్కని కోసం సమాజం
ఎప్పుడూ జరిగేదే...

నడుస్తున్న తెలంగాణ మార్చి 2016

వెంటాడే జ్ఞాపకం

ఒడికట్టి సేకరించే తేనెటీగ తానై
కంటికింపైన పదార్థాలతో పట్టుపోసి
కడుపునింపే నాయినమ్మకు నేనంటే
కొలతకందని మా గావురం

తల్లికోడై ఒడుపుగా తిప్పుతూ
ఆచితూచి అడుగేయడం నేర్పేది
నష్టం కలిగించినా యాష్టపడకపోవు
నాయిన అవ్వ కొట్టొచ్చిన ప్రతిసారీ నాకో రక్షణవలయం

మీ నాయిన్న కొడితే నాకు దెలువది
సెద్ద బూతు పడుతున్న సెప్పితే ఇనురా నీ దయరా!
నీ బుద్ధి నీ యీపు మద్దెలయితదనీ నాయిన పేర భయపెట్టు
విలయం విరిగిపడుతున్నపుడు తమది తప్పుకాదనీ
తప్పంతా ఎదుటోళ్లదేననీ కీల్ కీల్‌కువిప్పి చెప్పే వకీల్

కుసకుస ఉన్నపుడు కన్నుమాయక, నన్నువదలకా
నాటువైద్యంతో నానా రకాలుగా బాగుచేసేది

'పంతులూ! మీదే దీపం సదువోడైతే బతుకు తెల్లారుతది
లాపోతే బతుకు సీకటి' అని సలాంచేసేది'
కతలు శాస్త్రాలు కైగట్టే నాకు దెలిసిన మొదటి కవి
బాగోతం ఆంగిక వాచక అభినయాలతో చూపే నటి

వొయిసు పిలగానివి అర్సి కంకెదు తినాలె
ఓర్సి పనిచెయ్యాలెనని వద్దనంగా కొసిరి వడ్డించి

తినేదాకా వదులక పోవు
తిన్న నన్నుచూస్తేనే తనకు తిన్నంతవు
యిగురం లేకపోతే‘ యీపు గట్టిగుండాలె.’అని బుద్ధిచెప్పు

పెండ్లి చెయ్యిమని మా నాయినతోటి కటకటపెట్టు
సదువు సదువని ఎన్నొద్దులు తిరుగుతవు?
కొలువని వాయిదేత్తవ్
‘ఆకలిదీరినంక అన్నం ఈడువోయినంక లగ్గం’ ఏమిటికనే ప్రశ్న
ఆపాయె బిడ్డా! ఒక్కనివైనందుకు నలుగురిని కనుమని పురికొలుపు

శాతనై శాతగాకున్నా తన ఆలోచనలు నా చుట్టే తిరుగే ఇరుసు
కుదిరిన పెళ్లితో నాయినమ్మ మొకం సింగిడైంది
నా పెళ్లిల పెద్ద మొకద్దమ్
నా భార్యకు కార్యగతాల సోపతి
పతికి సతి, సతికి పతి సంబంధం ఇద్దరికీ నూరిపోసు
నెలతప్పిన నా సహచరి తన కనుపాపలా నన్ను చూసుకుంది

నౌకరి మమ్ముల ఎడవాపుతుందని
పుల్కాషితనం పులుముకున్న రందికి మందు
నువు మాతో ఉండాలే అన్నపుడు అంతులేని సంతోషం చూసిన
ఐనా ఇరుకుపట్నంల ఇముడలే

మా కోసం ఎదురు చూపుల తపస్సుచేసు
దాసిపెట్టింది తీసి నాబిడ్డకు ఇచ్చు
ఎపుడైనా తలగమిట్ల కూసుండు ఎంత పాపం చేసింది
ఏమో సిన్నవోయినవని వీపు తడుతదేమో అనుకుంటే
ఇపుడు దర్వాజ మీది చిత్రపటమై
ఎంత నిర్దయగా నవ్వుతుంది

అచ్చు
10-04-17 ఆంధ్ర భూమి సాహితీలో ప్రచురితం

కిరీటం మీద నెమలీక

వానకాలం ప్రకృతిని వసంతం పూయిస్తే
ముత్తైదువతనం ఆకుపచ్చగా మెరుస్తుంది
తంగెడు కొమ్మల చేతులు చాపి అమ్మతనమై పిలుస్తది
బతుకమ్మలో అతికిపోయి మాలాధారామై పూలు అలరారుతూ
పలువరుసలు పలువరుసగా ప్రకాశిస్తయి
పువ్వుకోసం కూర్పు పొద్దుకు పాదయాత్ర
చెట్టు చెట్టుకు వెతుకులాట దొరుకకపోతే తొక్కులాట
దొరికినపుడు ఉరకలెత్తే మనసు ఆధ్యాత్మిక సుగంధమైతది
ఎన్నో వర్ణాలు ఏకవర్ణమై సమోన్నతంగా పరవశిస్తయి
ఆడపడుచులు కోకిలరాగంలో స్వరమెత్తే శబ్దలయ చప్పట్లు
పాట బతుకుతెరువు తత్వంలో ఆట గంభీర
మరోతరాన్ని ప్రసవించే పరిపూర్ణత
తల్లిగారి పొలిమేర కన్నతల్లిలా దాటిస్తూ
పలుగురాళ్లకు పసుపుకుంకాలు పెడ్తది
బాటసారులకు తతంగమంతా తవ్విపోస్తది
అలుకుపూతకు తెచ్చే ఎర్రమట్టి తట్ట శిఖిలంపై
తంగెడుపువ్వు కరీటం మీది నెమలీక
స్వరాష్ట్ర సాధనకై అమరుల ఆశయాలను పుష్పించడానికి
ఆరడుగుల నేల బతుకు పువ్వై నవనవలాడుతూ
తెలంగాణ బతుకమ్మ వికసిస్తది
తంగేడు పువ్విపుడు నాలుగుకోట్ల ప్రజల నవ్వుమొఖం
తెలంగాణ శిఖలో సాధికారత తురిమిన అధికార ముద్రిక
ప్రగతి పొద్దుమీద చెరిగిపోని ప్రజల ముద్దెర

తెలంగాణ రాష్ట్ర భాషాసాంస్కృతిక శాఖ **'తొలిపొద్దు'** కవితా సంకలనంలో ప్రచురితం

ఎదురు చూపులు

పెగులని గొంతులో అదృశ్య విస్ఫోటనలు
నేలతడపని వానకు నెర్రలు వారిన కరువు
ప్రసవ వేదనతో రైతు తొక్కులాట
ఎతల యాతం బాధల్లో
ఎదురుచూపుల కండ్లు సెవెంటి ఎంఎం స్క్రీన్‌లు

మనసు రగిలే రందిలో ఆశల ఆవిరి
బతుకు పొలంల తండ్లాటలు బరిబాత దు:ఖాలు
మొగులును మొగిని తదేక పరిశీలనలో
మిన్నుకు మన్ను తెగని చూపుదారం
వానరాదు
ఆశచావది
పేరుకుపోయే అప్పులోని గుర్రాలు కలలోను పులిలా గర్జిస్తయి
క్రాప్ హాలిడే లేని మొండిజీవి రైతున్నంతవరకు

బూడిదగుమ్మడి బుర్రవోయి
కుల్లి దర్వాజకు వేలాడుతున్న కోరిక
గొలుసుల్లేని వరికంకుల కోసం ఊరపిచ్చుకలు
సరిపోని తిండి కీచులాటలు

ఎట్లాగో పారే ఏరును మలుపుతరు
బీడు బూములకు జీవం పోస్తరు
ఇజ్జతితో బతికే రైతుకు కాసింత గుండె ధైర్నం కరిగించి పొయ్యింద్రి
సార్సార్ దండం
అప్పులతో సంది చేసి
రైతును నిరందిచేసి రైతును బతుక సూదుంద్రి.....

నవతెలంగాణ 'దర్వాజ' 02-07-2020 తేదీన ప్రచురితం.

గో దారి

తప్పులు కావాలని చేస్తామా?
పుష్కలమైన పుష్కరభక్తి తొక్కిసలాట
అంతమాత్రానా చచ్చినవాళ్ళు తిరిగొస్తారా?
అధికారులను ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడమెందుకు?
ఓట్లకు తూట్లు పడందెపుడు?
నేతల సేవలో భక్తులు భరించాలి
పుష్కర స్నానం చేస్తున్నపుడు పుణ్యఫలం కర్మఫలమైంది

తొక్కిసలాటలో ఎవరికి ఎవరు?
అలజడి జనప్రవాహానికి ఎవరేంజేస్తరు?
అంతమాత్రానికే గగ్గోలా?

ఎపుడు లేనంతా ఎక్స్‌గ్రేషియా పదిలక్షలు ప్రకటించాం
బతికినోల్లకు పుణ్యఫలం బతుకనోల్లకు మోక్షఫలం
చరిత్రలో ఎన్ని జరుగలేదు?
పుష్కర ప్రేమికులారా! మీకుమీరే బాధ్యులని గుర్తుచేస్తున్నం

విగత జీవులయ్యేవాళ్లకు
మరణానంతరం అండగ వుంటం
ప్రమాదాల్ని చూసి దిగులుపడొద్దు
గుండె దిటవు చేసుకోవాలి

సామెత చెప్పినట్లు కుక్కతోక పట్టుకొని గోదారి ఈదాలే
పుష్కరుని పేరు చెప్పి ఒక్క మునుగు మునుగాలి
ఉంటె ఇటు పోతె అటు ఏదో ఒకటి

15.7.2015 రాత్రి 10 గం.లకు కోస్తాంధ్రలో జరిగిన ఘటనకు స్పందించి

మనాది సర్వే

రండి మేడం రాసుకోండి
పేదరికం పెట్టుబడిలో కట్టుబాట్లు కట్టడి
రూపాయలే రూపమనుకునే లోకంలో
వియ్యానికి పోతే ఆస్థిదయ్యంతో ఒడువని కయ్యం
ఆశ కదమ్మా! మనాది పంచుకుంటే మనసు తేలిక
బిడ్డా! మనసుపెట్టి విను
ముప్పైతొమ్మిదేళ్ల పెద్దోడు
పెండ్లి ఆశలు కొట్టేసుకొని విస్తర్ల మిషిన్లతో కుస్తీ పడుతుండు
ముప్పైఏడేళ్ల నడిపోడు
చిల్లర వ్యాపారంలో పోటీతట్టుకోలేకపోతుండు
ముప్పై ఐదేళ్ల చిన్నోడు తప్పనిసరి పరిస్థితుల్లో
ప్రైవేటు కొలువులకు పరిగెడుతుండు
అక్షింతలు వేసి కన్న రుణం తీర్చుకోవాలని ఆరాటం
కుమిలిపోతున్న లేమితనమ్ముందు
దిగులు దీర్ఘకాల రోగాల పుట్ట
కాటికి దగ్గరవుతున్న కాలంతో కలెబడుతున్న ఎదురీత
బండెడు బాధలున్నా మొండి బతుకుమీద ఆశ కదమ్మా
ఇగ రాసుకో తల్లి
గూనపెంకల ఇల్లు వానొస్తె వురుస్తది
బిల్లుమందం కరెంటు వాడ్తం
అన్నింటిలో అగ్గువతనం పిల్లలకు ఉగ్గుపాలతో నేర్పిన
లేకేం? బ్యాంక్ ఖాత నిండుకున్నది
జాగలా? భూములా? దుకునం బతుకు గిరాకి తీరు
వంశం మీద ప్రీతికదా! వశమైతలేదు
సర్వే సంగతేమో కానీ సంబందం సూడు
సచ్చి నీ కదుపున పుదుత!

(2014 సమగ్రసర్వేలో నా భార్యతో ఎదురైన అగ్రవర్ణ పేదకుటుంబంతో ఎదుర్కొన్న అనుభవానికి అక్షరీకరణ)

ఆత్మగౌరవ శిఖరం

జీవన్మరణాల రణం చెరోవైపు
బతుకడం కోసం వేసే చావు కోలాటం
ఆయుధాల గలగలలు,
కత్తుల సత్తువ
శత్రువు సింహస్వప్నపు సైనిక శిబిరం 'మౌ'
మౌనంగా ప్రసవించింది
అస్తమించని అక్షరసూర్యున్ని

అడుగడుగుక్కి పడగెత్తి బుసకొడుతూ
విరుచుకుపడుతున్న వివక్ష కోరలు
కష్టాల కొలిమి నేర్పిన ఒడుపు
జాతి కన్నీళ్ళు తూడువడం కోసం నీతి పరిమళం

అశ్రుధారలను అరికట్టడానికి అక్షరాన్ని ధరించింది
జడుపుకే జడుపు పెట్టాలని ఒడుపు నేర్చుకుంది
మూతికి ముంత ముడ్డికి ఆకు కట్టి తరతరాల కర్మ
పాదముద్రికల చరిత్ర మలిపేలా
అణగ దొక్కిన అస్పృశ్యతపై పెనుగులాట

అవమానం అంతు ఎంతని ప్రశ్నిస్తూ
నేర్చిన విద్య అస్థిత్వపు పతాక

దీక్షా కృషి తపస్సు మలిచిన ఋషి
గేలిని ఓడించిన గెలుపు
పీడనకు చరమగీతమైన అంకితభావం
బాధల్ని బోధించు!
ఆత్మగౌరవ పసరు ఉసురుకు నరనరాన ఎసరు పెట్టిన సొగసరి

సమీకరించు !!
విడివడిన బతుకుల తడబడని ఐక్యత ఎగజిమ్మిన రేపటి హామి
పోరాడు!!!
చావు పుటుకల జీవితం
తలవంచని అరణ్యంలా బలహీనులు గెలుపు నిర్వచనం

ఎవడి ముందు మోకరిల్లని ఆత్మగౌరవం
వ్యక్తిత్వ శిఖరం సముద్రంలా పొంగాలి
శిరసొంచని పర్వతంలా నిలువాలి
పట్టుకుంటె నిప్పులా తగలాలి

పచ్చని చెట్టుకు ఎర్రని పువ్వులా సమానత్వం
సర్వం నీలిమయం చేసిన
ఆచరణ చూపిన చూపుడువేలు ఆదర్శం
నిరంతరం సమాంతర శిఖరం

31.03.2016. 9గం.ల రాత్రి
దళితశక్తి మార్చి 2017

దిశ

శిక్ష పడ్డ ఖైదీలా నా చేతల్ని విరిచి నాకే కట్టిన వృత్తి
మనసుకు ముసుగు తొడిగి ప్రతిరోజు గురికంభం ఎక్కిస్తుంది
ఖాళీ తలలు జ్ఞానంతో నింపాలనీ...
అనంత విశ్వాన్ని రంగరించి అద్భుతంగా పోసిన పట్టులో
ఆత్మగౌరవంతో వాళ్ళనీ కూర్చుండవేత్త

తరగతి గది వేదికపై చుట్టచుట్టిన నేలను పరిచి
వెండి వెన్నల్నీ వెదజల్లుత నిప్పులు గక్కే సూర్యరణాల్నీ
అరచేతి భూతద్దంలా భవిష్యత్తు ప్రదర్శిస్తా
అమాస తామసి నల్లబల్ల శుష్క మస్తిష్కంపై
అక్షరగీతల్ని అంకెల రాతల్ని ధవళ వర్ణపు దివిటీలు చేసి
ఆచరణ సింగిడి పూయిస్తా

మరుగుతున్న బాధలతో ఎదను కరిగించి
రేపటిని బతుకు సాంచేలోకి ఎత్తుత
అంకితభావాన్ని దోసీట్లో దూసి నరనరాల్లో త్యాగం నింపుత
పారేశాన్ బతుకు పతంగులకు
నిరాధారమైన నింగిలోకి చుక్కల్ని చూసి రమ్మని ఎగరేస్తా
తెరచిన పుస్తకంలోంచి మొండి అనుభవాల్ని దేవి
అంపశయ్యపై జీవించే కసిని నింపుత

జనహృదయాల్లో జీవించ
ధైర్యాన్ని భుజానికెత్తి ఆత్మస్థైర్యాన్ని గుండెలకితొడుగుత
పరివర్తనను కలిగిస్తూ ఆశయాలను వెలిగిస్తూ
ఊపిరున్నంతవరకు కొవ్వొత్తిలా కరుగుతుంటా.....

జూన్ 2019 పాలపిట్ట మాస పత్రికలో ప్రచురితం.

ధాతు

పదేళ్ళ నా బిడ్డ
వాళ్ళమ్మతో..
"కోపంతో కొర కొర చూస్తూ కయిక్కు వయిక్కు మనే"
నాన్నను ఎట్లా భరిస్తున్నావే ?

"పంటికింద రాయి బాధించిందనీ
తినడం ఆపేస్తామా?
ఓర్పుని ఆభరనంగా భరిస్తేనే" జీవితమందట వాళ్ళమ్మ

మద్దతు దొరుకలేదనీ మసిలిందట.

అలుగు దుంకుతున్న దు:ఖంతో వచ్చి
అద్దం ముందు గడ్డం గీసుకుంటున్న
నాకు ఆటంకంగా కూర్చుంది
ఓదార్పు వెన్నతో వెన్ను నిమిరాను
కుదుట పడది

"ఆ పిచ్చిదాన్ని పిచ్చాసుపత్రికి పంపిచ్చుమనీ"
జీవితమంటే
గడ్డం తెగుతలేదనీ బ్లేడ్ని పారేసినట్లు కాదన్న

ఇద్దరూ దొందు దొందే
మూతి ముడేసుకొని గునుగుతూ వెళ్లింది.

జీవితమంటే
కష్టాలు కన్నీళ్లు కలగలసే ఉంటాయనీ
తెలుసుకుంటుందో.... 13-07-2018

దివిటి

దేహ దాహ మోహితులను
మేనువిందుకు ఆహ్వానించే ఆకలీ
పొందుబాధల సలపరంలో
నశమవుతున్న నాజూకుతనం
కరుగుతున్న దీపస్తంభం
శరీరపు చక్కెర కేళిలోచిక్కి నలిగిపోతున్న సుకుమారం
వలపుల తలపులు తెరచి మురిపిస్తావు మెరిపిస్తావు

ఒళ్లు కంపకు తట్టుకున్న పికిలిన బట్టయితది
ఎర గాలానికి గాయపడ్డ చేప బాధ
కాల్చిన ఇనుము విస్తరించినట్లు
ఇవేవీ పట్టని కడుపు తిప్పలరాతిరంతా తెల్లారుతది

భోగంతనం బతుకు రోగాల బాగోతమై
అరికాలు నుంచి నడినెత్తిదాకా సలుపుతున్నా
ఆయాసపడని తనం శాందిరి కింద చెదిరే ధాటి
బతికే దంద రెండంచుల బొంద
జీవితాన్ని మత్తకొలిపే రోగం రదంలా ఇందె పద్దతి

మొగ్గ బతుకులు సిగ్గులొలుకుతూ
బలిపీఠమెక్కి అగ్గి మీద ఆహుతవుతున్న గుగ్గిలం
ఉరిల చిక్కిన బతుకు ఆఖరి ఘడియల అంపశయ్య

రోతబతుకు కొత్త చిగురు తొడిగితే
అదే దిక్సూచి దిశానిర్దేశన దివిటి

విస్పష్ట దృశ్యం

భావం నివురు కప్పిన నిప్పు
గుండె లోతుల్లో అంబాడుతున్న సంభాషణ
సంబరం ఒక సంరంభం
మనసులోకి ఇంకుతున్న శబ్దలయల ఇంపు హొయలు
తొణికిసలాడుతున్న ఎదకడలి తరంగాల మనసు మేథోమధనం
పంచుకునే పరవశం
బంధాలు తెంచటానికి ముంపును పసికట్టే ఇంధనం
నిరసనల సరసన చేరి లబలబ మొత్తుకుంటది
మాట వెనుక మాటును చేధించే అర్థపరంపర
కసిదీరా కాటేయడానికి కాచుకునేకాలం రూపుమారిన హాలాహలం
అలుసు అనర్థం చూపు ఆనని అతిశయం వాపు బలుపు కాదు
బాధల మడుగుని కదిలిస్తే వెంటాడే తేనెటీగల గుంపు
నైపుణ్యం మురిపిస్తది ఓర్పు మరిపిస్తది
అనవరసం అర్థం ఆయువుమీద విషపు నవ్వై వికసిస్తది
భాష లాలించే తల్లి
దొర్లే తప్పిదాల్లో ప్రతికార ధృతరాష్ట్రకౌగిలి కావొచ్చు
సోదరా! ఉపన్యాసంతో ఊదర కొట్టకు
అమ్మ భాష ఉమ్మనీరు తాపవచ్చు
భాష ఒక యంత్రాంగం, నిర్వర్తన మంత్రాంగం
కుతంత్రాలను ఎదుర్కొనే పోరుతంత్రం
స్వతంత్రాన్ని కోరే స్వేచ్ఛ
ఒడుపు భాసికం, జడుపు పిరికితనం
భాష నిశాచరి కాదు వెలిగే సంచారి
అప్రయోగమైన భావం
రాక్షసరతిక్రీడా భాషతో జరభద్రం

సాహిత్య ప్రస్థానం 2016 మే సంచికలో ప్రచురితం

శకలం



నీ భుజాలను చుట్టుకొని ఈ ప్రపంచాన్ని
నీ వేలి చివరి లక్ష్యాన్ని సాక్షిగా
నిలుపాలనుకున్న
నీ బిడ్డ ఆశయాల్ని అడియాశలుగా
తండ్రి లేని బిడ్డని చేయడానికి
మనసెట్లా వొచ్చెరా తండ్రీ!

గుక్కతిప్పుకోకుండా ఏడుస్తూ
చాతకపక్షిలా జనాశూన్యాకాశంలోకి
అవిసే గుండెలతో పులుకు పులుకున చూసే చూపులపై
గునపాలు దించే చేతలు ఎట్లా వొచ్చెరా తమ్మీ!

నడిసే పోద్దులాంటి నీ స్పర్శ కోసం
రెండు కళ్ళని సూర్య చంద్రుల్ని చేసిన చిన్ని
వెతుకుతూ కుంభవృష్టిగా కురుస్తోంది
కనికరం కురిపించెటోనివి కక్ష గట్టినవా? కఠికోడా?

అర్థాంతరంగా జీవితాన్ని తెంచుకున్నావని
ఎడబాటు తట్టుకోలేక తలుచుక తలుచుక
నీ సహచరి విలపిస్తుంటే (కన్నీటి మంటలో)
రాతి హృదయాలు మైనములా కరుగుతున్నాయి కానీ
నువ్వు పాషాణమైతివా?

అయ్యలేని అమాస బతుకును
బాధలు భూగోళభారాన్ని మోస్తూ కాలాన్ని ఈదిన అవ్వకు
కన్నీళ్ళ కంఠశోష మిగిల్చితివా?
తోడు పుట్టిన అన్నా, చెల్లి

కూడ పెరిగిన యాది పుస్తకం గురుతులు తుడుపలేక
పగిలిన గుండెలతో దుఃఖ సెలయేర్లవుతున్నారు

నీ దోస్తులు, నీతో కుస్తీ పట్టినోళ్ళు అన్నీ మరిచి
నిర్దాక్షిణ్యంగా విడిచిన నీ జ్ఞాపకాలు
పరిక్కంపకు పికిలిన బట్టతీరు చింపుతుంటే
తడి కళ్ళపాతాళ గరిగెతో దేవుకుంటున్నారు

మూడు పదుల వయసులో నూరేళ్ళా?
నీవు లేవంటే ఎవ్వరూ నమ్ముతలేరురా నాయనా
నమ్మకాల్ని వమ్ము చేయనోనివి
దుఃఖప్సారతో కమ్మేస్తివీ దుర్మార్గం కాకపోతే ఏందిరా ఇది?

జిజ్జుకు నిలవడేటోనివి
సావును గావు పట్టకపోయినవు
ఏదీ నీ రేషం చిరునామా?
మరణం మెడలు కటుక్కున కొరికి తప్ప దీయకపోయినవ్?
నీ కుటుంబానికి నీవు లేని జీవితం
సహాయము సముద్రమంత ఉన్నా దూప తీర్చని నీరే

పొద్దు పొడిచే తావులున్న నీ భార్యా బిడ్డలకు
నీవు చేసిన అన్యాయం
ఎవరు తీర్చాలిరా ! మానిపే కాలం తప్ప
నీ లక్ష్యాల స్మరణ చూపే కక్ష్య తప్ప

(తేది: 17-02-2020న గుండె పోటుతోఅకాల మరణం చెందిన కజిన్ బ్రదర్ కీ.శే. సిద్దెంకి కనకరాజు స్మృతిలో.... అక్షర నివాళి.)

కవి - కవిత్వం

రాత్రంతా పిడికిట్లోకి తీసుకొని
మూడేసిన కనుబొమ్మల నడుమ
అక్షరాలకి పోరు మంత్రమేసి
పొద్దు పొడుపులో రణాన్ని
ఎగిల్లివారక ముందే ఎగజల్లెవాడే కవి

కలలు కన్నీళ్ళ సూదులతో
పచ్చబొట్టు పొడుస్తున్న
జాగారం మీది అక్షరాల అల్లిక

పీడకలల దాడిలో
ఏదో శక్తి ఆవహించినట్లు లేసి
పీడితుల్ని పిడుగులుగా మలుచాలనే ధ్యాస

ఎతల మొగులుమీద కారు మబ్బుల్నీ ఎగవోసి
తురిమిన పదాల్లో ఉరుముల్ని పుట్టించే రాపిడి
ఎక్కడున్నా విరిగిపోయిన చీమకాలు బాధనువిని
విలపించేవాడే కవి

మానవత్వం మంట కలుస్తున్న చోట
మనుషుల్నీ ప్రేమించాలనీ
మనసు పంటను కొస్తూ
సమానత్వ గంటను తెగించి మోగించే శబ్దబేరి

కనపడని కుట్రల్నీ పసిగట్టి
కాలాన్ని కరవాలం చేసే కత్తిధార కవి
కత్తి కదుపారది - కవి కుతి దీరది

ఇప్పుడు కావాల్సింది
భూమికి బరువైన కవిత్వం కాదు
మట్టి పొత్తిళ్లను తట్టి లేపే నిఖార్సైన విత్తనం

తరానికొ వెయ్యిమంది తయారయ్యే కవుల్నీ
కాలం దారుపట్టి దిక్సూచి దీవిటీగా
దిగంతలకు నిలుపేది ఒక్కరినే

కవిత్వమంటే వేడుక కాదు
తీగ తెగిన గొంతు
కవిత్వమంటే పండుగ కాదు
కన్నీళ్లని ఆరవోసే ఎండుగ
జనాన్ని సాయుధం చేసే సమ్మోహన క్రీడ

నేటి నిజం 18-10-2017

జ్యోతిపథం

నిశీథి బతుకులకు నిలువెల్ల ఆశల్ని తొడిగిన
ఆశయాల నిజరూపం ఆ అమర జ్యోతి
చీకటి మింగిన ఎలుతురు ఎతల్ని అజ్ఞానానికి అతికిన సాహసి
ఎట్టి మనుషుల కర్మపై
ఎలుతురుపూలు జల్లిన పొద్దుపొడుపు పూలే
మూతికి ముంత ముడ్డికి ఆకు
కర్మపేరున మనిషిని కాటేస్తున్న మూర్ఖత్వం
అధర్మ వేదాలకు అగ్గిపెట్టే గులాంగిరితో కాండ్రికించి ఉమ్మి
శవయాత్ర చేసిన దీటి సలాం దెబ్బ
అవతారాల కుట్రల్ని
రక్షకుల్ని రాక్షసులుగా మలిచిన నేరచరిత్ర మీద
పోరు రాజేసి మెదళ్లని మేల్కొల్పే జాతుల నిట్టాడు ఎనగర్ర
ధిక్కార స్వరాన్ని వినిపిస్తూ సబలలుగా తీర్చిదిద్దుటకు
బోధచేయ సతిని సిద్ధం ప్రతిపక్షం ఛాదస్తం వెంటబడి పెండనీళ్ళు
నిండార చల్లుతుంటే మొండి ధైర్యం బిరిగిసి నిలిచిన భావుటా
చదివితే నాలుకని తెగ్గోసే నిష సంస్కృతిపై కక్కిన నిప్పులు
సాయుధజ్యోతిని చూసిన మనువుగాడిపుడు
వాంది వాడే తాగుతూ బూడిదలో దొర్లుతున్నాడు
సాహిత్యం సూద్దరోల్ల సంకల జేరిందని నెత్తినోరు గుద్దుక చస్తుండు
అక్షరం జీవనమనీ అభ్యుదయం నూరిపోసి
అజ్ఞానం నెత్తికొట్టిన బహుజనుడు
బుద్ధుడి సంస్కరణలు నింపిన బూతదయ
సమాజమొసగిన బిరుదు 'మహాత్మ'
నీ బోధ వెదజల్లిన దిక్దింగంతం
మానవత్వం, సమానత్వం
నువ్వు నిజం నీ ఆచరణ మా ఇజం

20.01.2017

మనిషి కోసం

పొత్తి గుడ్డల్లోని పసిగుడ్డులు
కళ్ళు మూసినా కత్తి పట్టుకున్న యుద్ధవీరులు
వాళ్ళు తాగేది తల్లిపాలతో పాటు బతుకు పిపాస

బాధ ఒక్కటే బతుకులు వేరు
మానవతప్పిదమైనా మారణహోమమైనా
మానవత్వాన్ని కాల్చుకుతినే చల్లారని కాష్టం
కారణాలు రణాలు వేరు
గుండెల్ని కోస్తున్న పిల్లల మరణాలే బాధాకరం

మోతకోలు బ్యాగుల బరువులు
కలిపిపెట్టిన టిఫిన్‌డబ్బాల పగటన్నం
యూనిఫాం దుస్తులతో కడక్‌గా
బుడిబుడి నడకల కవాత్‌లు

కన్నవారి ఆశయాలు బస్సు అద్దాల పొరల్లోంచి
చిరునవ్వుల టాటాలు కనురెప్పల మధ్యన ఆశయాలు
కాపలలేని గేటుకు రాకాసిరైలు కాటు
కమిలిన కన్నపేగులు వలపోస్తున్న కలలు
మసాయిపేట గాయం దేశాన్ని కుదిపిన వైనం

కుతంత్రాల కురుక్షేత్రమై పసిపిల్లల్ని మసిచేస్తున్న రణంలో
ప్రళయ నొప్పులు దీస్తున్న నిత్యగాయాల గాజా!
అచేతనంగా విలపిస్తున్నా గొంగ్రాలా

విషాదం మిగిల్చిన
కాలుతున్న కడుపుతో పిల్లికూతల ఏడుపుల్ని చూస్తే
కడుపు తరుక్కుపోనిదెవరికీ?
క్షిపణి దాడుల క్షోభ శిక్షించందెవర్ని?
మనసు ఇంకిన ఇసుకలో ఆశలు అడుగంటనివ్వకు
శాంతి ఒప్పందాలు
ప్రాణం పోయేంతగా తన్నుక చస్తున్నయి
ఐక్యరాజ్య సమితికి అమ్మతనం తెలుస్తలేదేమో
ఆయువు కోల్పోతున్న పాలస్తీనా
సామ్రాజ్యవాద విస్తరణలో సమిధవు

అంటుకున్న మంటను ఎవలకైనా అంటుతది?
ధ్వంసమవుతున్నది దేశమొక్కటే కాదు
మనుషులు
పోరాడా!, మేధావీ!, కవీ!, కళాకారుడా!
మౌనం బద్ధలు కొట్టు
కాగితాల్లో కాలం అత్తరుగా మనిషికోసం

మసాయిపేట ఘటన, గాజా గాయాలను చూసి..
08.08.2014 ఆంధ్రజ్యోతి దినపత్రిక

కుంజీ

అవమానాలు అణువణువు దహించినా
రేపటిని అయ్య మాత్రం వెలుతురు కలకన్నాడు
వివక్షల పక్కన నిలబెట్టి అక్షరం మనసు పొరల్లో విత్తి
అంటరాని పడగ నీడన తిరుగుబాటు పలకపై దిద్దించింది

వాగ్దానం చేసిన కాకిపిల్ల కోకిలై ధిక్కార స్వరాన్ని
కాకుల తండ్లాటల్ని కత్తుల్ని విత్తులు చేసి గొంతెత్తింది
'ఊరు మనది, వాడ మనది' అన్న జిజ్ఞను ఎందర్నో మేల్కొల్పింది
త్యాగాల దోసిట్లో ఎడ్డిజనాల్ని ఆకుపచ్చ వనాలు చేసింది

మునుంబట్టి పల్లవుల్లో బాధల్ని కలిపి జనాల్ని బాణాలు చేసి
చైతన్యాన్ని పాదరసంలా గుంపులోకి ఒంపిందు
ఇంటి పేరు గూడ గర్కపోసలకు తర్కంతో తొవ్విపోసిన జాడ
గాయాలకు గేయాల పసరు రాసిన గెలుపు పిడికల తంపి

మట్టికీ, వెట్టికీ కొత్తచూపును ఎత్తిపోసిన గూడ
ఛిద్రమైన బతుకుల కుతకుతల్ని
నిప్పురవ్వలు జేసి నిత్యం కుంజీ ఇచ్చే
అంజన్న పాటలు జీవిగంజి నీళ్ళు
అవి పదహారణాల కావు పదహారు భాషలు
పాటకు జీవం పోసిన గాయకుడా!
బడుగుల చైతన్య సాయకుడా! నీ పాటే సదా మా గురి
ఆ పాటలు కాలం తలమీద పీడితుల్ని వెంటాడే తూటాలు

20.11.2016

మండువ

గోనెపల్లి పేరు చెప్పితే
ఆకు మాదే కల్లు ఏలు కొరుకుతది
పోద్దాళ్ళు, పరుపుదాళ్ళు, పొంగులొట్లు, వడకళ్ళు
ముంజలు, తాటి పండ్లు

కుతియాల్ల పెద్దగుండు వాగోలే
పొంగే కల్లు తాగాలే గని
నింగికి నేలకు నీవే చక్రవర్తివి

అది మయసభకాదు
మమతల మండువ
అంటు ముట్టు లేని సమానత్వ వేదిక

దూపార, కడుపార
తురితి పరిచే తాటి వనాన్ని దర్శించు
మూడుకాళ్ల ముసలితనం మేటేషం కట్టి
రాగాల్దీసి రాళ్లను కర్గిస్తది
దుబ్బనేలను మట్టి సింహాసనం చేసి
ఆ ఘడియ సేపైనా నిన్ను రాజునుజేసి
గజగజ వణికిపోయే సేవిక

వాగు యిసుక పరిచిన మెత్త
కానుగు చెట్ల నీడ ప్రకృతి ఎగజల్లే ఏసీ
ఇక్కడి చెట్లగాలి ఆత్మలు పట్టుకుంటయి

చుక్కల్ని తాకే చెట్టెక్కి మొగి చెక్కిలి దూసి
సురాపానం లొట్టిల నింపి
గొంతు దూప తడిపే నల్లటి గౌడన్న
దేదీప్యంగా ఎలిగే అహంలేని ఆత్మబాంధవుడు

నవ్వత్ ఇలాచ్చిల పరం కలగలసిన నీర
సువాసనయి మనసునూరిస్తది
నీరా తాగే మనిషి ముందు
అమృతం తాగిన ఆ దేవతలెంత?
నిస ముందట మనసేకాదు లోకం తైతక్కలాడుతది

మురుగు లందల మునిగిన ఎల్లమ్మ
దాసిన మాతమ్మను కొలిచే సిద్దోగం
గడగట్టి ఎదుర్కోలుగా మాదిగిండ్లకు జాతర
ఇంటికో భక్తి బోనం
దప్పు సప్పుల్ల శివసత్తుల చిందులు
జమిడిక బైండ్ల కొలుపుల్ల నెత్తురు తాగే గావు
సర్వ్వగంప నమ్మకం జల్లుతది
పారజూచే చిత్రకన్ను ప్రసన్నత కోసం
పండుక్కే కాదు మందువ నిత్తె జనజాతర

సుట్టూ పదూళ్లపెట్టు ఆర్సుకునే మా ఊరి మందువ
పాటగాసిన పట్టు మూట గట్టిన బతుకు
ఇయ్యాల్ల బహుళజాతిని వైన్స్‌తో
కొరిజీవునాలతో పచ్చిగా కొట్లాడుతున్న పచ్చి గాయాల వాగు
ఊరి కడుపుల కములుతున్న పేగు

'పునాస' తెలంగాణ సాహిత్య అకాడమీ, జూన్ – సెప్టెంబర్ 2019. త్రైమాసిక పత్రికలో ప్రచురితం.

ఇక్కడి మట్టి మహాత్మ్యం

ఇక్కడి చరిత్ర రాజ్యపీడన మీద ఉద్దేం
ముక్తి కోసం పారిన రక్తం
జంపన్న వాగు
మనసుల్ని తట్టిలేపిన చిలుకలగుట్ట మర్మం
నేటికీ త్యాగాల జనజాతర
ఇక్కడి మట్టి తత్వం
సావుకు ఎదురేగి ఎక్కుపెట్టిన ప్రాణం
జల్, జంగిల్, జమీన్ కోసం సమరం కొమరం భీం
ఇక్కడి ఆత్మబలం ఉడుం పట్టు
రజాకార్లతో గర్కపోసల కత్తుల కోలాటం
ఇక్కడి రోషం లేళ్లు పులుల్ని తరుమే ధీరత్వం
చాకలి ఐలమ్మ ధిక్కారం సంఘటిత చైతన్యం
ఇక్కడి సంగరం నిరసించిన అక్షరతిలకం
కత్తిగాట్లకు కలం చిమ్మిన నెత్తురు షోయాబుల్లాఖాన్
ఇక్కడి తెగింపు దొరతనాన్ని మింగిన మృత్యువు షేక్‌బందగీ
నిరసన బలి దొడ్డికొంరయ్య
ఇక్కడి అణిచివేత వలస పాలనపై తిరుగుబాటు
నాలుగు వందల మంది అమరత్వం ఆరిపోని గండదీపం
ఇక్కడి ఆచరణ ఒంటిని దుల్‌దుమ్మగా మండించిన శ్రీకాంతచారి
సల్లారినా కొద్దీ సగేత ఆత్మహత్యల రక్తలేఖలు
సబ్బండ ఆకాంక్షల సర్వం స్వరాష్ట్ర అస్తిత్వ సాధన
ఇక్కడి జాగల జిద్దూ చరిత్రంత చేవున్నది
విముక్తికోసం కొనఊపిరి కూడా కొట్టుకాడే స్వభావమున్నది.

15.07.2017

అస్తమించని వేగుచుక్కలు

ఆత్మల్ని పలికించే అమ్మ భాష నెనరు
మనసుల్ని పేనే జీవజల బంధుత్వం వాళ్లది
ఆత్మగల్ల వరుసలు కలిపేదెవరు?
మా జాతి మూలపురుషుడు జాంబవముని తత్వం
చరిత్ర సాందిరి కింద కొంగవాలు కత్తి తిప్పుతూ
దగుల్బాజీ బాపనిజంపై నిజాల నిప్పుల తప్పెట ఆనవాళ్లు
"తాలే లెల్లే..." దరువులై చిందులు తొక్కుతూ
"వార్ ముడివిప్పుతున్న ప్రత్యామ్నాయ సంస్కృత సారథులు

మా కిష్టయ్యమామ గొంతెత్తితే కోకిలరాగం మూగవోతది
మురలిమామ ఆడేషం కడితే సిల్వర్ స్క్రీన్ మిల్క్ బ్యూటీలు
పులుకు పులుకున పునికిసూసుకుంటయి

ముకుందమామ డ్యాన్స్ ముందట స్టార్ల స్టెప్పులు చతికిల పడుతయి
ఎల్లమ్మేషమ్ కట్టే లచ్చమ్మని చూడాలిగనీ అచ్చుగుద్దిన దేవత
రాంతాత బుద్రకాన్ జోక్లకి కామెడీలు నవ్వీ నవ్వి శోష తప్పుతరు

జనం – శోకగీతంలో కట్ట తెగిన చెరువయితరు
క్రోధంలో భూకంపంలా బద్దలయితరు
సింగారంలో వయసుడిగినా కోరికలు కోలాటమేస్తయి
బాగోతం వారి పుట్టు వన్నె
నటనలో ఇంద్రున్నే నాట్యంలో నెమలిని మరిపిస్తరు

వాళ్లు నటనా జీవితం తెలిసిన సిందోళ్లు కాదు
కల తత్మీర్ తెలిసిన కళా బంధువులు
ప్రత్యామ్నాయసంస్కృతీ ఆకాశాన అస్తమించని నిరంతర వేగుచుక్కలు

28.03.2018, రాత్రి 10 గం. లకు

పంతం

ఆనవాళ్ళు లేవు   తెగదెంపులు లేవు
యుద్ధమే నిరంతరం బేలచూపుల ఆయాసం
పద్మవ్యూహంలో చిక్కిన తండ్లాట
తీరని కోరిక ఒక్కతీరుగ కొట్టుకాడుతది
బతుక్కి బారమవుతున్నకొద్దీ ఆశలదొడుకు అంతుండది

ఊరించే ఆరోగ్యం క్షీణిస్తున్నకొద్దీ
ఆశ రంగులు మారుతున్న ఊసరవెల్లి
గ్యారంటిలేని వైద్యానికి తోడు పేరుకుపోతున్న అప్పులు
కరిగిపోతున్న ఆయుష్షు ఆయుష్షు మంచుగడ్డకు
బలమైన ఆదరణ భరోస
మనసు చంచలత్వం బతుకుచుట్టూ తిరుగుతది
ప్రాణమ్మీది తీపి చికిత్సలను వెతుకుతూనే వుంటది

బతుకునాణానికి విశ్వాసం ఒకవైపు
థెరపీలు మరో వైపు
బతుకాలని బైసు దివారాత్రము చరిత్ర చదువుతది

కొచ్చిగురు తొడుగుతున్న ఆకాంక్షలు
మృత్యువుపై జయగీతికలను
మూల్గుల ముళ్ల మధ్య సలపరం ఎత్తుతున్న రాగం
రెప్పమూయని కళ్లతో పోరాటం
అలియని పంతం కోసం విధికృతాన్ని మించిన ఆరాటం
పంతానికి పుట్టెడు పెట్టుబడి

(క్యాన్సర్ పై పోరు నా తల్లిలాంటి తల్లులకు...) నవతెలంగాణ దర్వాజ 08-10-2018

కి' రణం

నిజాల నిప్పులు ఎగజల్లుతూ
నివురుగప్పిన నిప్పు క్షిపణిలా దూసుకొస్తాడు
చట్టాలు గాండ్రిస్తున్నా
పిడికిలెత్తిన బడుగువెతల బరిసెగా
బరిలోకి దూకుతాడు

అమాస చీకట్లో పండు వెన్నెలయి
నోరులేనోల్ల సుడిగాలి సునాదమై
న్యాయం కోసమే బతుకుతడు

సంకెళ్లు స్వర్ణకంకణంలా
సమాజం బంధ విముక్తం చేయడానికి
నెరుపని సంధికై తాను బంధీ

ముదిమిలో మొలకెత్తే విత్తనంలా
కుట్రల్ని తుత్తునీయలు చేయడానికి
జనవిజయం కోసం
మబ్బుల్ని చీల్చే 'కి' రణంలా ప్రసరిస్తాడు

పోరుదారి
మేల్కొల్పే గండ దీపధరి
నిలిచే అక్షరం
నూరిపోసే ధైర్యం
స్మరిస్తే పద్యం
స్ఫూర్తినింపే వాద్యం
జీవితమే తిరుగుబాటు మహాకావ్యం
వారెప్పటి కీ ముగింపు లేని వాక్యం 05.04.2019.

బహురూపులు

మేథో మథనాన్ని రంగరించి
ప్రజల సాయుధం చేస్తున్న ఏ మొనగాన్నైనా
గుచ్చిన కత్తి మొన మీద ఊరేగిస్తూ
ఈ దేశంలో ఉన్మాదం లేదని ప్రకటించండి

మన లక్ష్యం ఆకలిలేని భారతం
ఆకలి నిర్మూలనే మన ధ్యేయం
ఆకలిబాధ రెండు మామిడి పండ్లను కోసితిన్నా
ఆకలి తీరది ఆకలి రూపమ్మారది
అందరు చూస్తుండగానే గ్రామపంచాయితిలో
ఉరివేసైనా సరే ఆకలిని చంపండి

అప్పుల కంటే అభివృద్ధి ముఖ్యం
అభివృద్ధి పేరిట అప్పులు తప్పవు
వేలకోట్ల అప్పుల్తో పంగనామాలు పెట్టి
విదేశాలకు పారిపోయినోళ్లను వదిలేసైనా
రైతుదే రాజ్యమనీ దండోర వేయండి
వేలల్లో లక్షల్లో పంటకోసం అప్పు చేసిన రైతుల్ని
నలుగుట్లో ఇజ్జత్దీసి నవ్వులపాల్జేసి
ఆత్మ గౌరవం అమ్ముకోనైనా అప్పు కట్టేలా చూడండి

ఎంతైనా స్త్రీలను పూజించే దేశం కదా!
పకడ్బంది చట్టాలకు పదును పెట్టాలి
పసిపాపల్ని పండు ముసల్లనీ కామం చంపేస్తే బాధపడ్డాం

ఆయేషామీరా, నిర్భయ, వరంగల్ ఘటనలు మహా ఘోరం
పోయిన ప్రాణాల్ని ఎలాగో తేలేం
అమాయకుల్ని బలిచేసైనా చట్టాన్ని కాపాడండి

సర్వోన్నత రాజ్యాంగం కల్పించిన
హక్కులు అందరికీ సమానమే
శాకాహార ముద్దపప్పు ఫత్వా జారీచేస్తూ
తరాల అలవాట్ల తలలు తీసినా తప్పు కాదనీ
చట్టమ్ముందు అందరు సమానమనీ బాకాలూదండి

బహురూపుల బాహుబలులు
దేశపు తలరాత మార్చాలనే తపనతో...
బతుకులపై దృశ్యాదృశ్య
గోముఖ పులుల లీలలు కాంచే
లౌకిక రాజ్యంలో లౌక్యమా
గొడ్డు బర్లకు పాలు పితికే ప్రజాస్వామ్యమా!
మొండి దున్నపోతులు తరుము కొస్తున్నాయి జాగ్రత్తా!

22.7.2019

అనలు కొనలు

కనపడని శత్రువువతో కలెబడే ఆధునిక రూపం
పిడికిట్లో బంధిస్తామని పట్టుకున్నా కొద్దీ జారే పాదరసంలా
అపసవ్యదిశలోనూ అంతు దొరకది
చీల్చబడినా మూల్గ వరకు చీల్చే అంచనాలకందని అల్పపీడనం
కళ్లు మూసే కాంతులు, ఉరుముల భయోత్పాతాలుండవు
భస్మంజేసే పిడుగులే బతుకుల్నే కాల్చివేస్తయి
రక్తపుటేరులు పారించే జడివాన రంకులరాజకీయం
ఊహకందని పరిణామం

తరతరాల వృత్తి ఆచరణను కోసి కారం చల్లుతున్న గోసేవ
గో కళేభరాల్ని ఎత్తలేదనీ ప్రాణంతో తిత్తిదీసే పెద్దకత్తి గోదాడి
సగేసే కాటికాపరి క్రరతానై కపాలాన్ని పొడిచెత్తి ఇకిలిస్తది
నేలగ్గొట్టి ఎడమకాలితో తొక్కి చూరచూర జేసినా కసిదీరది

ఆరడుగుల జాగ కోసం పీనుగు సంద యాత్ర
పొలిమేర పెట్టు తరిమిన చిత్రకన్ను
అమాయకత్వం పగిలి ఆరిన నిప్పుల తప్పెట
పగకింద శరుణుజొచ్చిన పాబంది
కండ్లు తెరిచిన ముండ్ల మీది బతుకు
తాళ్లు దించిన వంతెన మీది పాడె బరువు దించింది

అగ్ర రాజ్యాలతో పోటీపడే దేశం అగ్గువకు రాకెట్లమ్ముతది
ఆకలిని ఎండవెట్టడానికి ఆర్థిక వేత్తల ఆలోచన
ఆకలో రామచంద్రా! అననియ్యది
హామీల వర్షం అరచేయిల స్వర్గం చూపుతూ

అమ్ములపొదికి రాజకీయం సాంకేతికత అద్దుతూ
గుడిసెల చీకట్లు నింపి గుళ్లు గోపురాలకు బంగారం తాపుతది
అప్పులిచ్చి విదేశాల కొప్పులు సవరిస్తూ సకిలిస్తది దేశం
చంద్రమండల యాత్రలు ఎన్ని జేసినా
బడ్జెట్ కమండలంలోని నీళ్లు పేదలమీద చిలుకరించక
భార్య శవాల్ని భర్తలు మోసే బతుకులు మారయి

మరుగుతున్న కామం చెరచబడిన బతుకుల్తో పావనమైతయి
న్యాయాన్ని ఆశ్రయిస్తే మరణం బహుకరించే యాక్సిడెంట్లు
కవుసుతున్న నెత్తురుతో చట్టం తడిసిన పిట్టయి వణుకుతూనే వుంది

పశువుల దుమ్ము పశుకాపరుల పడుచుదనాన్ని మోహిస్తే
కుల తల్వారు తలల్ని తప్పదీస్తూ సర్వ గంప చల్లుతది
నెత్తురు అద్దుకున్న అరచేతులు అచ్చుల సప్పలు గోడకు గుద్దుతే
నల్లటి రక్తం మౌనంగా రోదిస్తుంటది

చదివితే సహిస్తున్న కులగజ్జి
యదార్థాల గుట్టు విప్పే రోహితుల్ని
నుజ్జు నుజ్జు చేయకుండానే ముట్టకుండానే మట్టువెడ్తది
కానూనుకు దొరకని కథలు చెప్పుతది అధికారం

మీకేమి హానీలేదని నమ్మబలుకుతుంది పులి
ఒట్టుతిన్న మాలాధారుల్లా గొర్రెలు ఓట్లు కుమ్మరిస్తున్నాయి
నిశా కషాయి కత్తుల్లో బతుకుల్ని పెట్టి
అనలు కొనలు ఎల్లాలని ఆశలు కలలు గంటున్నాయి

11.09.2019 సా. 6.00

కీర్తులాట

ఊకున్న కాడ నిత్తె కయ్యం వొట్టిగ వస్తదా?
బైరూపుల ఏషం కట్టి బజ్జాతి పాట పాడాలే
ఎవడైనా గురిగిల దాసి గుంజక్కడతడా?
ఇగురం కొద్దీ ఇజ్జతిద్దీసి
ఇంట్ల ఉన్నోన్ని బయటకు గుంజాలె

పుల్ల ఏస్తే పుట్టెడు నీళ్లు ఆగుతయి మనిషి ఆగడా?
మతిని సల్లారకుండా మంటపెట్టాలే
బండ బూతులు మనసుని ముండ మోపి ఎండల కూసుంటది

తిట్ల ఉరివెట్టి కట్లతో కరిపెట్టి
మనిషిని తిరేట్ల తీరు తింపాలే
బతికినంతసేపు కొడుకు కొట్టుక సత్తడు
తిట్టుకుంటైనా మొక్కాలంటే అప్పుడప్పుడు కుక్కలం గావాలె
పేరు లేనోడు ఎవడో చెప్పిండు? నోరూ మోరీ ఒకటైతాది?

ఏ రంగం లేదు అంత బైరంగమే
దాతు దొకిచ్చుకుని నారదముని కావాలె.
ఏర్పడుకుంట గిచ్చి ఎట్లయిందని దువ్వి
శాట్ల తవుడు పొయ్యకుండానే కొట్లాట పెట్టాలే
ఇల్లు కాలంగ ప్యాలాలు ఏరుక బుక్కాలే

ఊరుకు ఉపకారం పీనుగుకు సింగారం ఎంత సేపు?
మంచితనం కంటె మోరుదొప్పుతనపు యాదుంటది

భయపడక భయపెట్టు గజ్జుమంటరు
తన్నవోయి తన్నిచ్చుకున్నా తండ్లాట తప్పొద్దు

రీకునాలు పెడితే సెంచాల్లం పట్టాలే
మాట నునుపైన మంగలి కత్తి
బొండిగెను, బొక్కల్ నరికే మొండిది

కొంచెంతనమూ అవసరమే
ఓర్వ జాలక వాతపెట్టాలే
రూపం కలలో కనబడితే కంటిమీదికి కునుకురావొద్దు

ఎవడు చెప్పిన బుద్ధి? పొట్టిగ ఉండడం తప్పుకాదు?
పొడువు భుజాలు ఎక్కక పోవుడే తప్పు
ఉపాయమున్నోడు ఉపాసముంటడా?
తిట్టే కాడ తీడాలె తీడె కాడ తిట్టాలె

సంకల చొర్రుడే కాదు సద్ది కట్టుకొని బుద్ది నేర్వ పోవాలే
ఆఖరికి ఏదో ఒకటి అంటక పోతదా?
అంతదాక బుదగరిచ్చుడు మరువొద్దు

తేనె పూస్తూనే తెగ్గోసేదాకా తెలువొద్దు
తొక్కుడు బండగానే ఉంటూ తొక్కాలి
అపకీర్తి అద్దుకున్న కీర్తిగజ్జిని గోకాలే
రక్తం కారినా రాకుతనే ఉండాలే...
రానురాను రాజు గాడిద పంచకళ్యాణి కాకపోతదా?

13.09.2019. రాత్రి 11 గం. లకు.

సమ్మతం

ఒక్కటే దేశం, ఒక్కటే భాషంటున్నపుడు
ఒక్కటే కులమని ఎందుకనవు తండ్రీ!
నింగినేలా కలిసేయాల్ల
మనుషుల్ని ఎందుకు కలువనిత్తలేరు నాయనా
తత్వం సరే! ఓట్ల తండ్లాట ఏంది సామీ?
స్వచ్ఛ భారత్ దృష్టితో మురికి చెత్తను ఊడుస్తున్నట్లే
కులమకిలిని మలిపేసే స్కీం ఏదన్న పెట్టండి
మనసుల్ని పవిత్రంగా శుద్ధీకరించుకుంటరు
పారదర్శకత లేని వెలుతురు
కాని వాళ్లకు కటిక చీకట్లు నింపి
తనవాళ్లకు దేదీప్యమానమై వెలుగుతూనే ఉంది
మౌఢ్యం కక్కే కసాయకాంతిలో శాకహార ముద్దపప్పు శాసనం
ఇనుప ఆకాశంలో ఉరితాడులా వేలాడుతూ
మాంసాహార అలవాట్లపై రణమై మరణమై వెంటాడుతూ
శరణు కోరినా కడుపునిండని కత్తిలా ఉంది
పొడుస్తున్న పొద్దు కదిలే కాలమంతా
సమస్తం సింధుత్వ భజన
అనుమానం కులవృత్తి చర్మకారుల కుతికెల్ని
ఉక్కుదంతాలతో చీల్చే మూకదాడులు గావుపడుతుంటే
బలిపీఠం బాధతో బావురుమంటుంది
స్త్రీలను గౌరవించే దేశం భారత్‌ని మాతగా కీర్తిస్తుంది
కామవాంఛల కల్లోలంలో గాలానికి చిక్కి చస్తున్న చేపల్లా
దళితమాతల ఆక్రందనలు
వినక, చూడక, మాట్లాడక శిల్పమైన భారతమాతను చూస్తూ
గాంధీ సబర్మతీ ఆశ్రమంలో మౌనంగా అస్తమిస్తున్నాడు

శాస్త్రీయత ఎక్కడిది? సమగ్రమూ మతమే
అభ్యసనం ఖండాంతరాలకూ వ్యాపించనీ
సైన్సంటే సహించని ఛాందసవాద కుతంత్రానికి
ఆహుతి అయి కుళ్లిన దళిత రోహితుల్ని తలుచుకుంటూ
వీణాపాణి తీగెలు తెంపుకొని విషాదంతో విలపిస్తుంది

పుట్టకూ చెట్టుకూ దేనికి మొక్కినా
కేశవునకనీ చెప్పిన హిందూ సమ్మతంలో
అంగలార్పులు విన్న సకలసుగుణాభిరాముడు
తన పాదదూళితో రాతిని నాతిగా మలిచినా
మనుషులని మమతలున్న మనుషులుగా మార్చలేక
గర్భగుడిలో బంధీఅయి శోకిస్తున్నాడు
విధాత సృష్టి సమానమైనపుడు మనలో విషాగ్నులెందుకు??
ఈ దేశ ప్రతి సృష్టి చంద్రయాన్‌లా ఎదిగినా
కుల భూతమ్ముందు మరుగుజ్జుతనమవుతుంది

సర్వ మతాల లక్ష్యం ఒక్కటే
ఆత్మ పరమాత్మలు మిళితమయ్యే మోక్ష్య సామ్రాజ్యంలో
కులమతాల చిక్కులెక్కడియి? పేదా ధనిక తేడాలెక్కడియి?
శరీరాన్ని వదిలిన ఆత్మలకు వర్ణమెక్కడది?

ఇపుడు మత నినాదాలు అక్కర్లేదు
మానవత్వ సునాదాలతో స్వచ్ఛ సుమాలవ్వుదాం
ఊపిరున్నంత వరకే కొట్లాడే నువ్వూ నేనూ
వైరాగ్యం పుచ్చుకుంటే వైరమెక్కడిది?
మనిషిని మనీషిగా నిలుపుదాం పదా!!

తేది: 28.09.2019.

పాలపిట్ట వినూత్న కవిత - 2019

పాబంది

ఎందరికైనా చోటు కల్పించే
ఆధునిక ధరణీ పుష్పక విమానం
కెపాసిటి దాటిన రద్దీలో బస్సు పొద్దులు నిండిన తల్లిలా
తండ్లాడుతూ ముండ్లమీద నడుస్తుంటది

ఆర్టీసి బస్సులు సూర్యుని చుట్టూ తిరిగే భూమిలా
పొద్దస్తమానం ప్రయాణీకుల చుట్టే తిరుగుతయి
కాలాన్ని దౌడు తీసే అంశుమంతుడై
సీటు కుంపట్లో డ్రైవరన్నా
కునుకు పడని కంటితో వృత్తి కోలాటమైతడు
బతుక్కాలిన పిల్లిలా తిరిగే బస్సు సంపాదన
సంస్థ పాత అప్పు మిత్తికి సాలుతలేవు

బండకు నార చీరే బాపతీ
ఓట్ల కోసం రాగం దీసే సర్కార్
రమ్జు పాలనని మురిసిపోతున్నవా?

అప్పుల తూట్లు ఎన్నిపడ్డా
టిక్కెట్లకు తూట్లు పొడువని కండక్టర్‌నడుగు
మానవత్వం అంటే ఏంటో చెప్పుతడు
ఎత్తిన చెయ్యిని రెడ్‌లైటని బస్సాపుతున్న డ్రైవరనడుగు
నిబద్ధతకు నిర్వచనం చెప్పుతడు

టార్గెట్లకు మూలశంక పొడిసే
మర్యాదలు పంచే ఒంట్లో రోగాలు తడిసిమెపెడు
కంట్లో ఒత్తులు పెట్టుకుని కష్టపడ్డా అప్పులు పేరుతనే వుండే

రూపాయికి ఎకురం ఇచ్చే దానకర్ణునిగదా!
రాయికున్న దయ నీకు లేదాయే
రాతి సింహాసనమెక్కిన నీతి పాలకా నీతులేమాయే?
మడమ తిప్పని మహానీయా మాటలెటువాయే?
కందెన మొకమా బతుకులు కందిపోతన్నయి సూడు!
మాకిదేం గతీ? మాయగాడా?
ఉద్యమ సోపతివనీ తలుచుకుంటే మనసు ధరిస్తలేదు

బస్సాపి తెలంగాణ ఉద్యమం ఢిల్లీదాకా ఉరికిస్తివి
ఇప్పుడో బ్రేకులు ఫేలయినా బస్సుల్లా
స్మశానంవైపు గుంజుకపోయే యమకింకరుడివైతివా
నిజమే! పీనుగుల మీద సానుభూతి చల్లి
ఉద్యమం నడిపినోనివి
చస్తున్నా మనసు కరుగుతాది?

నీ హామీలు బూటకం
నువ్వాడేది నాటకం
మా వోళ్లు బతుకుల్ని ఆరడుగుల కాగడా జేసి కాలుతుంద్రు

ఊడిన పెచ్చుల సాక్షిగా పమానం చేస్తున్నం పాబందిగా
నీ సానుభూతి ఓట్లకు పొక్కలు పొడుస్తున్నం
పాత టైరు అంటుపెడుతున్నం
బస్సు చక్రాన్ని బతుకు చక్రంగా తీర్చడానికి
సమాజ బతుకు మార్చడానికి....

16.10.2019.

శుద్ధాంత

కన్నీళ్లసిరను కాలమ్మీద ముద్రించే కవిలా
చీకట్లో పొడుస్తున్నా సూర్యుళ్ళెతరు
సమస్త నిద్రాజగత్తులో వాళ్లు రవుల్లా మేల్కొని
వెండివెన్నెల్లా పారిశుధ్యత పరిమళాలు వెదజల్లుతుంటరు

కంపును తెంచే పిచికారి సుగంధాలు
అరుగని చీపుర్లయి ఊడ్చే ఆత్మవిశ్వాసం
దుర్వాసులు మెచ్చేలా శుభ్రతలద్దుతుంటరు

చెత్త బండితో ప్రభాతభేరితో సైనిక కవాతులా సాగే సేకరణ
ఇంటింటిలో రవికిరణాలై గురితప్పని క్షిపణిలై సేకరించే రణం
తడి పొడి చెత్తని! వేరుచేసే ప్యూరిఫైడ్ పర్యావరణం వాళ్లు
బతుకు మొగులుకి వేలాడదీసి దుర్గంధంలో మునిగే సాహసం
అప్పుడప్పుడు మిగిలిపోయే కన్నీళ్ల చిరునామా వాళ్లు

మన చెత్తమీద వారికెంత మమకారమో మనకంత వికారం
మునివేళ్లతో అసహ్యంగా పట్టుకొస్తే
అపురూపంగా తన్మయత్వంతో తడుముతుంటరు

వీళ్లపై ఏ స్వచ్ఛ భారత్‌ల దృష్టి ఆనది
శాశ్వతంగా వృత్తికి శ్వాసైనా
కళ్లున్న కబోదులకూ కనవడది
దేవున్ని నమ్ముకునే దేశంలో
తూకంతో కొలిచే భక్తి కదా!

మొక్కలను ఎత్తి పోస్తుంటే
రాలిన చెత్తను తలదాల్చి తరలిస్తరు
కోరిక మనిషిలోని చెత్త
స్వచ్ఛతా మనసును కడిగే క్లీనర్

వారివి నిత్యోత్సవాలు
వారివి ఫోజులు కావు వారే ఫౌజులు
వారు చెయ్యకపోతే వార్త
కంపురహితమే వారి కర్తవ్యం
ఇంపు సహితమే వారి లక్ష్యం

మనం మనుషుల్ని ప్రేమిస్తం
వారు మనిషినీ, మనిషిలోని చెత్తను ప్రేమిస్తరు
ఎవరు మనిషి? ఎవరు మనీషి?

కూటికి సాలని కుతి తాండవిస్తున్నా
శ్రమకు సమంగా తూచని గాంధీ
రూపాయి నోటు మీద తదేకంగా నవ్వుతుంటాడు

పొగడినా తెగడినా వాళ్లకు తెలిసిందొక్కటే
చెత్త ఎత్తడమే కాదు
ఎత్తిన చెత్తను పారవోసి మిత్తితో సహా అంటుపెడ్తరు.
మరి చెత్త మనసుల మీద తిరగబడితే....?

15.12.2019

రక్తం కూడు

చింత తీరొద్దు
చితి చల్లారొద్దు
దీపం కొండెక్కితే జ్ఞానం వెలుగైతదా?
పాపం పుణ్యం ఒక్కటైతయా?
రక్తం పారించైనా రాజ్యభక్తి నిలుపాలే

రొద పొగిలి పొగిలి సానుభూతి సాగిలపడుతుంటది
గెలిచినోల్లు కమ్మగా ప్రమాణం చేస్తుంటరు

వ్యూహాలు ఉప్పెనలు
పన్నాగాల సునామీల్లో విషం పొర్లుతుంటే
రోషం పచ్చిగాయలపైన కారం చల్లుతుంటది
సందయాత్రలో సానుభూతి ప్యాలాలు ఎగజల్లి
హామీల జల్లెడతో అన్నీ దేవుకోవాలి
రాజకీయమూ పాలన మనది గావాలే

బ్యాలెట్ బాక్స్ నింపటం కోసం
గుడి నిర్మాణం కోసం గుండెల్లో కత్తులు విత్తితే కదా
మనుషులు తల్వార్లై తలపడ్డది

మతం మత్తులో హిందూ ముస్లింలు
తెగిపడ్డ తెల్ల పావురాల్ని చేసి
రావణ కాష్టమై మండించితే గదా!
మనం రాతి సింహాసన మెక్కింది

మందిర నిర్మాణమ్మీద విసుగుపుట్టక ముందే
పౌరసత్వం ముంతపొగ రాజేస్తిమి
ఆలోచనలు రావు
ఇపుడన్నీ బంధీలు
అడిగేనోటికి అర్బన్ నక్సలైటనే చిక్కెం

సంతోషం మిగిల్చితిమా దు:ఖంలోకి కూరుకపోతం
దృష్టి మళ్లించే సృష్టి చేస్తనే వుంటిమి
పేదల ఖాతాలు నింపుతమని నోట్ల రద్దుతో నోట్లే మన్నుకొట్టి
జీఎస్టీ, 370 రద్దు, సర్జికల్ స్ట్రైక్స్, మూకదాడులు
పక్కదేశపోని మీద పటాకులు కొట్టి పాగల్ గాన్ని చేస్తిమి

మేధావుల నాలుకకు ముల్లు ఇరిసి మాట్లాడకుంట చేస్తూనే
నల్ల వెంట్రుకల్ని పాపితే కదా తెల్ల వెంట్రుక దొరికేది
ఇప్పుడు నల్లా లేదు తెల్లా లేదు
గుండుగుత్త గుంపుగా పేనుకొరుగుడే
అధికారాన్ని నిలుపుటకు బాగోతులు తవ్వుతున్నం
ఎన్నార్సీ సీఏబిలతో అలజడి రాజేసనం
వొద్దనేటోల్ల తేవాలనేటోల్ల నిమిషాలల్ల లేపేస్తం

దేశ రక్షణకు శివధనస్సు విరిచిన రామునిలా
మనుసుల్ని మతంతో విరిచేస్తూ బీరాలు పలుకుతున్నం
ఏదేమైనా రక్తం కూడు తిన్నా సరే
మనుషుల రక్తం జుర్రుకతాగైనా దేశభక్తి చాటడానికి
అధికారం అందుకుంటం

26.12.2019 మధ్యాహ్నం 2 గం. లకు

శబ్ధ పల్లవం

శిక్ష పడ్డ ఖైదీలా
నా చేతల్ని నాకే కట్టిన వృత్తి
ఊపిరి సలుపకుండా ఉషోదయానా
గురికంభం ఎక్కేలా గుండెల్ని ప్రేరేపిస్తుంది

రాతోపదేశం చేస్తున్న భవిత
నవకాంతుల యశస్సు పురికొలిపే లక్ష్యం
సుద్దముక్క రాసే ప్రతిగీత

గొంతెత్తే శబ్ధాంగ విన్యాసాల్లో
ఉవ్వెత్తున ఎగసే నటత్ భృకుటి బతుకు సంద్రం
అలలు అలలుగా కన్నీళ్ల కల్లోలంలో పడినా
లేస్తున్న ఆశయాల కెరటం
నింగీ నేలను ఏకం చేసే నిబద్ధత పుట్టెడు భరోసా!

ఉపమాన ఉపమేయాల విసత్తుల విశదీకరణలో
బెదిరించినా ఎదురించే తెగింపును నింపుతున్న జీవిగంజిని
ఒంపుతున్న ధారాళ జ్ఞానం
అన్యాయంపై పోరాడే స్ఫూర్తి
రేపటిని కసిగా నింపుతున్న అనంతం
ఆజన్మాంతం తోడుండే ఈ బోధ
ఎప్పటికీ నిరాయుధ సాయుదమే

నిశీథి మెదళ్లను పొడిచే ముళ్లుగ్గ్ర
నిప్పులు గక్కే సూర్య కిరణాల్ని ఆవిష్కరించే రణమా?
మరణతోరణమా?
ఇజాలను నాటి ఇంగితాన్ని నింపే ఇగురం నేర్పుతో నేర్పుత

తరగతి గది వేదికపై
చుట్టిన భూగోళాన్ని బల్లపరుపుగా పరచి
మస్తిష్క క్షేత్రాల్లో పుచ్చిపోని అక్షరాలని విత్తి
అందరరినీ ప్రేమించే అభ్యుదయ సంటకోస్త

అమావాస్య తామసీ ఆ నల్లబల్లా
సందిగ్ధ శిథిలావస్త స్థితిలో శుష్క జా&ఒన శకలాల్ని
అంతరాల్లేకుండా పేర్చి
దీపశిఖలుగా మలిచి వెండి వెన్నెల్ని వెదజల్లుతూ
పరిమాణాల్లేని ప్రశాంతతా పరిణామాల్నిలేపుతా

సాక్షిభూతమయ్యే అక్షరాత్మల్ని
శబ్ధ పల్లవాల్ని జేయడానికి
అనంత విశ్వాన్ని రంగరించి
దిక్‌దిగంతాల పరిమళించే ఆత్మ విశ్వాసాన్ని పంచుతూనే ఉంటా..

21.02.2020   రాత్రి 9 గం. లకు

ప్రేమ మరణమంత బలమైనది

పరమగీతం 8:6

దోతి కుచ్చిళ్లల్లో దాచుకున్న నిప్పు
బట్టల బహురూపుల్ని తనువును కాల్చుకుంటుందా?
తిరగబడ్డఘోరం భారమైనా
బతుకు శాంతి కోసం తొక్కులాడుతుంటది
అశాంతి ఉచ్చులో చిక్కుకొన్న అలజడి బతుకు
కత్తుల వంతెన మీద కాలుమోపుతుంటది

నిజమే ప్రేమలో భయముండది
తెగింపుకు ముగింపుండది
బలమూ బలహీనత
చావూ బతకూ సమస్తం ప్రేమే
ఆజన్మ శతృవుల్ని ఆత్మీయులుగా
ఏకదేహమైన మిత్రుల్ని పగదారుల్ని చేసేది ప్రేమే

ప్రేమ ఒక విషం
సేవిస్తూ జీవిడిస్తూ ప్రేమనే కలవరిస్తది
ప్రేమ ఒక ఆక్రోషం
తెగిపడ్డ శరీరం మొండిగా కొట్టుకాడుతుంటది
ప్రేమ ఒక తపం
జ్ఞాపకాల వలలో చిక్కి గడ్డకు పడ్డ చేపలా
విలవిల్లాడుతూ శ్వాస స్మరిస్తనే ఉంటది
పిచ్చిదై సెంచాల్లం పడుతుంటది
ప్రేమ ఎప్పటికీ ఎండని పచ్చిగడ్డిలా
చంపేంత కోపం,
చచ్చేంత త్యాగం

ప్రేమించలేదని చచ్చేవారూ ప్రేమించమని చంపేవారూ
చచ్చిన వాన్ని చంపించినవాన్ని పురికొలిపేది
సంజీవనిగా ప్రాణాల్ని నిలిపేది ప్రేమే
జీవితాన్ని వాగ్ధానం చేసిన కాకిని నమ్మిన చిలుక
హద్దులు, సరిహద్దులు చెరిపేసి ప్రేమ అక్షరాలయ్యారు
ప్రతీకారం ఖండఖండాలుగా చీల్చిన చిహ్నాల ప్రదర్శన
ప్రేమవనపు కాకులకు సునామి హెచ్చరిక

ఛండాల ప్రేమని ఖండించినా తప్పుకాదనీ
అగ్రవర్ణపు దురాశ పాపయోచన
నూరిపోసిన తత్త్వక్రియలు
ప్రేమకంటే కులం గొప్పదని చాటిన తండ్రికి జేజేలు –మూర్ఖలోకం

ప్రేమ కోసం తండ్రి హత్యానేరంతో జైలుకు
ప్రియుడు తిరిగిరానిలోకాలకు
ప్రేమ శిశువుతో నిలువెత్తు వైధవ్యం విషాద వైరాగ్యం

‘ ‘కూతురు ప్రేమలేని లోకం అంతా జైలే” – తండ్రీ
“జీవితకాల దు:ఖం పులిమిన తండ్రీ రాక్షసుడే” – కూతురు
అతని ప్రతీకారం, ఆమె పంతం రెండు ప్రాణాలు బలి

పగ అశాశ్వతం, అక్రమం
ప్రేమ ఆకాశమంత ఎత్తయినది అగాథమంత లోతైనది
ద్వేషంతో దేహాలు అస్తమయమైనా
పురా స్మృతుల్ని ప్రభవించేది మిగిలిన ప్రేమే
ప్రేమ మరణమంత బలమైనది

11.03.2020. సా. 6గం. లకు



చావని బతుకోసం...

ఉరుముల్లేని పిడుగులుంటయంటే తెల్వకపాయే
కాళ్లకింది జాగ కాటేస్తుందంటే అర్థంకాకపాయే
శత్రువుకు బైరూపులుంటయంటే బోధపడకపాయే
ప్రపంచ మనుషుల గావుపడుతూ ప్రాణాల్ని జుర్రుతూ
జగమంత భస్మీపటాలం చేస్తుంటే తెలియకుంటుందా?

అదృశ్య భూతమొకటి ఆవురావురంటూ ఆకలితో గర్జిస్తుంటది
సలసలమరిగే సీసంలా చావుగీతం భీభత్సంగా ఆలపిస్తున్నది
నిర్లక్ష్యపు శిక్షకు పుల్కాషితనం సచ్చుపీనుగై వేలాడుతుంటది

ప్రాణాలు చీల్చబడుతాయని భయపెడుతవా? బతుకుతవు
ధైర్యమున్నోనికి వ్యూహముంటది
వ్యూహానికి ఉపాయము తోడై ఆచరణ రణమైతది
ముగింపులేని తెగింపు విరిచిన రొమ్ము
మింగుడుపడని తన కనికట్టు పద్మవ్యూహంల తానే చిక్కి
గిలగిల కొట్టుకాడుతది
సుచ్చుపోయించాలనుకున్నా సచ్చుపడుతది

ఎన్ని గండాలు దాటితే ఇంత బతుకు బతుకుతున్నం
లోకమంత అలజడి ఉన్నపుడే మనలోగుట్టు తేల్చేది
కల్లోలమైనపుడే మన కట్టుబాటు తెలిపేది
నిప్పులు గుండం తొక్కినపుడే నిబద్దత నిలవడేది

ఎన్నైనా చెప్పు చావూ బతుకు మనచేతల్లనే ఉంటది
నిల్చేది తల్చేది ఎటువైపు?
ఈ భూమ్మీద యుద్ధం లే0ది ఎక్కడ?
ఎగపోసుకుంట ఎంత దూరం ఉరుకుతవ్
ఉరికినంతదూరం భూమి ఉంటది
నేలపై మృత్యువు నమలక గుటకేయాలని నసపెడుతుంటది

యోధున్ని సాయుధున్నని గర్వపడకు
ఏ దిక్కు పోయినా ఒ దిక్కు ఎదురైతది
ఇపుడు ఆ ధృతరాష్ట్ర కౌగిలి తప్పించుకోలేవు

పరిగెత్తాల్సింది నువ్వుకాదు నీ ఆలోచనలు
బయటంతా సమాధులతోట లోనంత జీవపు ఊట
బతుకుతీపి ఉంటే బంధీగా
సంధించే చావును శుభ్రపడుతూ ఎదుర్కో
అలక్ష్యం, అజాగ్రత్త అన్నీ కలిస్తే దింపుడుకల్లం

మనిషీ! మందే మనమై, మనమే మంద్దై చికిత్స చేసుకోవాలే
నిర్బంధాన్ని కన్నీళ్లతో రోదిస్తూ నానా యాగీచేయకు
చావని బతుక్కోసం నీవే యాగమవ్వు

తేది: 28.03.2020

(సాహిత్య ప్రస్థానం జూన్ 2020 మాసపత్రికలో ప్రచురితం.)

దమ్మము

వంద అబద్ధాలు ఒక్క నిజం చేస్తయా?
పొత్తు లేకున్నా ఎన్నాళ్లు బొంకుతవ్?
వాకిల్లు తొక్కనోల్లం
కంచమూ మంచమూ వేరేనాయే
నువ్వు నువ్వే నేను నేనే
మనం కలిసి ఉన్నది ఎక్కడ?

జిందాబాద్‌లు ముర్దాబాద్‌లు పక్కనపెట్టు
నాటి తీర్పుకు లోబడుమంటివి
ఏకీకరణ భంగపడ్డదన్న తీర్పుకు బమిసి సెంగలిస్తిరే?
నేటి వర్గీకరణ తప్పకు లోబడరా?

కడుపు నిండి నువ్వు
మింగ మెతుకు లేక మేం
మన కైలాట్కంలో ఎప్పుడు నువ్వే గెలిస్తివి
కసికెడు తిండి కోసమే ఇన్నేండ్ల తండ్లాట
పంపకం ఇంకా ఎన్నేళ్ళు?

తాడోపేడో తేల్చుకుందాం తన్నులాటలెందుకు?
ఈ తీర్పు కోసమే మావోళ్ళు కయిలి కొల్యాగలై రంకె లేసింద్రు
సుక్కల్ల దుల్దుమ్మలయ్యి మండుతున్న సూర్యుళ్ళయ్యింద్రు
ఆరిపోని వెల్తురుపూలు సల్లుతుంద్రు

ఏడుపు ఏడుపుకి ఎంత తేడా
కపటపు కుయుక్తుల ఏడుపు మీది
కడుపు కోసం కాలిన కమురు వాసన ఏడుపు మాది

చేతుల తునక కాకి తన్నుక పోయినట్లు
దోసిలి ఒగ్గిన చేతల్ని దోషులు చేయకుండ్రి
గోల పెడుతున్న ఖాళీ స్టీలు పళ్ళాలు గోసల్నీ
ఆకలితో సోచాయించుండ్రి
అయ్యవ్వల సంపాదించిన ఆస్తిని వాటాలేసుకుంటవు
అంబేద్కర్ ఇచ్చిన హక్కులు వద్దంటే ఎట్లా?
రోజురోజుకీ కఠినం అవుతున్న
మీ తత్వము చూసిన మనువాది సిగ్గుపడుతుండు

నూరేళ్లున్నా సావు
వెయ్యేళ్ళున్న వేరూ తప్పది
తాత జాంబవంతుని తత్వంతో పంచుకుందాం పా

వర్గీకరణ నివురుగప్పిన నిప్పు
ఏ కోణం నుంచి రాజుకుంటుందో తెలియదు
ఇంకా పీఠముడితో కూర్చుంటావా?
పీఠాలకు పాఠాలు న్యాయమే నేర్పుడు కాయం

వాటం చూసి గూటం గుద్దుడు ఇంకా కాయం
గోసంగి ఏషం కట్టి కొంగవాలు కత్తి తిప్పుడే
భూమి తిర్రమర్రకానీ కట్లు తెంచుడే
గెట్లు పంచుడే రాజ్యాధికార గేట్లు తెరిచి
కొరుకుడు పడని మనువేదాన్నీ ముంచుడే
పార్లమెంటుకు బిరబిరా ఉరుకుడే....

25-09-2020 రాత్రి 10 గం.లకు
(రాష్ట్రాలు వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు నిచ్చిన నేపథ్యంలో....)

వెన్నెముకలు

అవమానాలు ఎన్ని కల్గినా
సహనాన్ని ఆవాహన చేసుకున్నాడు
ఇజ్జతికి తాకట్టు పడ్డాడేకానీ
తిరుగుబాటుకు మజ్జతియ్యలేదు
అప్పుల కుప్పలు పెరిగితే
కొన్నిసార్లు దేహాన్నైనా వదులుతున్నాడు కానీ
దేశం వదిలిపోలేదు

రెండు కండ్లల్లో
రేయింబవళ్లు నింపుకొని
ఎండీ
నానీ(తడిసీ)
వనికీ
పంటకై తపస్సు చేసినోడు
మంట పెట్టడానికి ఎట్లైండు?

శమటతో
బీళ్లల్లో బీజాలు చల్లి
పొలాల్లో మొలిసినోడు
లొల్లయి మొలుస్తుండు ఎందుకు ?
పిడికిలితో విత్తనాలు చల్లినోడు
పిడికిల్లెత్తుతున్నడు?

సూర్యుని చెక్కిళ్లు పట్టి దుక్కి దున్నినోడు
చీకట్లని పట్టి వెలుతురు దున్నడా?
గిట్టుబాటు కళ్లానికి నోరెత్తనోడు

చిక్కం తొడిగే చట్టాలను తొక్కడా?
చలిని తట్టుకోవడానికి నెగడయి మండినోళ్లకి
చట్టాలు ఒక లెక్కా
అధికారం రంగు మారుతది
పొలం అంటువాయని రైతాయే
ఎట్ల మారుతడు?
పొలాన్ని
రైతునూ
పంటనూ
కబ్జా చేస్తే ఊరుకుంటడా?
ఆగ్రహపుట్ట పలిగి ఊసిల్లై లేస్తడు
విషమ్మీదనే విషమైతడు
మట్టిలో ఉన్నోడాయే
నింగికంటిన అధికార నషాలన్ని
మట్టిలోకి దించుతడు
పిట్టలని తరిమినట్లు
చట్టాలని తరుముతడు
కొత్త సాగుబాటు చేసినట్లు
కొత్త శాసనాలను నాగలితో తిరగరాస్తడు
వారు ఈ దేశ వెన్నెముకలు కదా!
ఎప్పటికైనా ఈ రాజ్యం
కార్పోరేట్ సంస్థలది కాదని
కళ్లు తెరిపిస్తడు
కాకపోతే వెనుకా ముందు

09.12.2020, మ. 3.20 ని. లకు



చూపుడు వేలు

యుద్ధం అనివార్యమని తెలిశాక
వ్యూహ ప్రతివ్యూహాలు రచించకపోవడం
యుద్ధం ప్రకటించక పోవడం దేనికి సంకేతం?

మనుషుల్నీ విడదీసే మను రాజకీయ వారసుల్నీ
శత్రు లక్ష్యాల్నీ, శత్రువును గుర్తించిన మనం
శత్రువును ఒకటిగా ఎదుర్కోకపోవడం బాధాకరం

నింగీనేలను దోసిట్లో పట్టి
నిద్రల్లేని రాత్రుల్లో టార్చిలైట్ కళ్ళతో
అక్షరాలను మెదడు జల్లిగంటేతో దేవి
చీకటి బతుకుల్లో వెలుగులు నింపిన బాబా కృషి
ఎట్టిలోంచి స్పీనిక్స్ పక్షిలా దూసుకెళ్లి
మనకు తరగని అనంత స్ఫూర్తిని దూసి పెట్టింది

అన్యాయాలు,అక్రమాలు అత్యాచారాలు జరుగుతయి
స్పందించే మనసులు కరువైన చోట ప్రచారమెక్కడిది?
మన పట్ల మనకు చేయాల్సినంత పోరాటమేది?

బోధ మనమూ బోధిస్తమ్
మన మాటలే నమ్మకం కలిగించవు
రణం లేని సమీకరణ
బువ్వలేని బొనంలా అలంకరించుకుంది
తలతెగిన మొండెంలా మన పోరాటం కొట్టుకాడుతలేదు

మనం బోధించాల్సింది
"అధికారం అందుకోలేని జాతులు అంతరిస్తాయని"
సమీకరించి నేర్పాల్సింది రంతంత్రం
మనపై మనమూ పోరాడాల్సింది
ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలుగా కలలుకనే రాజ్యాధికారం కోసమే

ఎన్నాళ్లు?
ఇంకెన్నేళ్ళు?
చౌరస్తాలో నిలబడ్డ ఆత్మగౌరం
ఎత్తిన చూపుదు వేలుతో
పాలకులు ఎపుడవుతారని ప్రశ్నిస్తుంది ?

మనం మన అలసత్వంపైనా
ఉదాసీనతపైనా, ఉద్యమించని తెగింపురహిత బతుకుపైనా
బరిసెలతో పొడిసే యుద్ధం ప్రకటిద్దాం!
అధికార ముద్రికలు అందుకునేవారకు

రాజ్యాధికారం సాధించే వరకు
నాపై నేనే యుద్ధం చేస్తా?
మరి నీవూ?

రాత్రి 10 గం. లకు

10-07-2020

అచ్చు

పేరు : డా. సిద్దెంకి యాదగిరి

తల్లి దండ్రులు : సిద్దెంకి లచ్చవ్వ, రాజయ్య

పుట్టిన తేది : 30-06-1980

చిరునామా : 4-38,గ్రా. గోనేపల్లి, మం. చిన్నకోదూరు, జిల్లా సిద్ధిపేట. తెలంగాణ-502267.

ప్రస్తుత చిరునామా :

H. No. 19-44/2D, Telecom Nagar,
Siddipet, Telangana, India -502103.
Cell:: **9441244773,**
email: sygiri773@gmail.com

పీహెచ్డీ పరిశోధనాంశం : తెలంగాణ పాటల్లో సామాజిక చిత్రణ - (2017).

వృత్తి : స్కూల్ అసిస్టెంట్ తెలుగు (భాషోపాధ్యాయులు - 1)

ప్రచురణలు: **1) మా తొవ్వ (2008) కవితా సంపుటి**
2) బతుకుపాఠం (2014) కవితా సంపుటి
3) తప్ష (2016) కథా సంపుటి

అవార్డులు ఒ బహుమతులు:

1) వేముగంటి సాహిత్య పురస్కారం - 2018.
2) సిద్ధిపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు - 2019.
3) తొగుట మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు - 2018.
4) జనార్ధన మహర్షి గారిచే ఉత్తమ కథా పురస్కారం - 2014.
5)నవతెలంగాణ తొలివార్షికోత్సవ పోటీలలో (2015) కవితాపోటీలో తృతీయ బహుమతి.
6) నవతెలంగాణ ద్వితీయ వార్షికోత్సవం (2016)కథా పోటీలో ప్రోత్సాహక బహుమతి.
7) ముల్కనూరు ప్రజాగ్రంథాలయం & నమస్తే తెలంగాణ కథా పోటీలలో ప్రోత్సాహక బహుమతి.
8) ఈనాడు కథా విజయం పోటీలలో ప్రోత్సాహక బహుమతి.
9) నవతెలంగాణ2019 పంచమ వార్షికోత్సవంలో చిన్నకథల పోటీలో ప్రత్యేక బహుమతి.

పాఠశాల అకాడమిక్ కార్యక్రమాలు:

1) పునాది పునశ్చరణ కార్యక్రమాల రూపకల్పన 2019.
2) తెలుగు భాషా సంబరాలు - రూపకల్పన, నిర్వహణ 2018.
3) సబ్జెక్ట్ మాసోత్సవాలకోసం తెలుగు రూపకల్పన 2018.
4) నిష్ఠ శిక్షణా కార్యక్రమంలో 4 విడతల్లో రీసోర్స్ పర్సన్.


సాహితీ సంస్థలు:

1. ప్రధాన కార్యదర్శి, మంజీర రచయితల సంఘం.
2. రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ రచయితల సంఘం.
3. జంబూ సాహితీ ఆన్ లైన్ కార్యక్రమాల నిర్వహణ.


Telugu SIRI - Dr. Siddenky,
Marasam Manjeera యూట్యూబ్ ఛానెల్స్ నిర్వహణ



2008



2014



2016

అచ్చు